

ములకలచెరువులోని జడ్పీ హైస్కూల్

నేడు మంత్రి నిమ్మల రామానాయుడు రాక

రైల్వేకోడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేటలో ఆదివారం నిర్వహించే సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు మంగంపేటకు చేరుకుంటారని తెలిపారు. అక్కడ తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రి కడపకు బయలుదేరి వెళతారని తెలిపారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

గుర్రంకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరామునికి స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కోదండరామునికి శనివారం స్నపన తిరుమంజన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అధికారులు స్వామి వారి అభిషేకానికి సుగంధ ద్రవ్యాలను, పట్టువస్త్రాలు, పుష్పాలను అందజేశారు. మూలవిరాట్‌లకు ఆలయ అర్చకులు పవన్‌కుమార్ అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు మధు ప్రవీణ్‌కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథాలయం కిటకిట



భక్తులతో నిండిపోయిన సౌమ్యనాథస్వామి ఆలయం

నందలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి ఆలయం శ్రావణ మాసం తొలి శనివారం కావడంతో భక్తులతో కిక్కిరిసిపోయింది. 108 ప్రదక్షిణలు చేసే భక్తుల గోవిందనామస్మరణలతో ఆలయం మార్మోగింది. దర్శనానికి భక్తులు సుమారు గంటపాటు సమయం వేచి ఉండాల్సి వచ్చింది. ముఖ్యంగా శనివారం సుదూర ప్రాంతాల ప్రజలు ఆలయానికి రావడం, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం పరిపాటిగా మారిపోయింది. ఆలయానికి వచ్చిన భక్తులకు సౌమ్యనాథ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు.

బాత్రూమ్‌లో కాలుజారి పడి సీఐ మృతి



సీఐ క్రిష్ణానాయక్ (ఫైల్)



క్రిష్ణానాయక్ మృతదేహం

మదనపల్లె అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బాత్‌రూమ్‌లో కాలుజారి పడి సీఐ బి. క్రిష్ణానాయక్ (48) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... మదనపల్లె పట్టణం రెడ్డీస్ కాలనీలో ఉంటున్న క్రిష్ణానాయక్ చిత్తూరులో ఏపీఎస్పీ 8వ బెటాలియన్‌లో సీఐగా పనిచేస్తున్నారు. నాలుగు రోజులు సెలవుపై మదనపల్లెకు వచ్చిన ఆయన హైదరాబాదులో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లి శుక్రవారం రాత్రి తిరిగి మదనపల్లెకు వచ్చారు. కాగా శనివారం ఉదయం బాత్‌రూమ్‌లో కాలుజారి పడి స్పృహ కోల్పోయారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారుం మృతుడి పెద్ద భార్య రమణీబాయ్ 2023లో చనిపోగా ఆమెకు ఓ కుమార్తె శృతి ఉంది. రెండో భార్య సునీతకు కుమారుడు రాఘవేంద్ర నాయక్, కుమార్తె గీతాబాయ్ ఉన్నారు. అనంతపురం 14వ బెటాలియన్‌లో పనిచేస్తూ బదిలీపై చిత్తూరుకు వచ్చారని, రెండు నెలల్లో డీఎస్పీ ప్రమోషన్ వచ్చే అవకాశం ఉండగా చనిపోయారని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మధ్యాహ్నం తమ సొంత ఊరు తంబళ్లపల్లె మండలం కొట్టాల గ్రామానికి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తరలించారు.

ఫుట్‌పాత్‌లపైనే రామభక్తుల పడక 6

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రాజెక్టులున్నా.. నీరు సున్నా...
- జిల్లా కేంద్రానికి ఒక్క బస్సూ లేదు...
- మంత్రి గారూ... మీరైనా పట్టించుకోండి... 6

జాడలేని కిచెన్ గార్డెన్లు

జిల్లాలో 285 పాఠశాలలు ఎంపిక

- పాఠశాలల్లో కనిపించని పచ్చదనం
- కూరగాయల పేరుతో నిధులు విడుదల
- ఏడాదికి రూ.14.25 లక్షలు దుర్వినియోగం



మదనపల్లె మండలం కిచెన్ గార్డెన్‌కు ఎంపికైన గంగన్నగారిపల్లె ప్రభుత్వ పాఠశాల

మదనపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ల జాడ పాఠశాలల్లో కనిపించడం లేదు. దీనికి సంబంధించి నిధులు విడుదల చేసినా ఎందుకనో పాఠశాలల్లో ఎక్కడా పచ్చదనం కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఖాళీ స్థలాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించి వాటిని మధ్యాహ్న భోజనానికి వాడాలన్నది ప్రభుత్వ సంకల్పం. దీంతో పాఠశాల ఆవరణంలో పచ్చదనంతో పాటు వాతావరణ కాలుష్య నివారణకు దోహదపడుతుంది. మరోవైపు అక్కడే పండించిన కూరగాయలతో వంటలు చేసి అక్కడి విద్యార్థులకు వడ్డిస్తే పోషక విలువలు పెరిగే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో పాఠశాల విద్యా కమిటీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, పిల్లల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసింది. సంయుక్తంగా ఇందులో పాలుపంచుకోవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుంది. అది కూడా సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పండించే కిచెన్ గార్డెన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకు అవకాశం ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి, కిచెన్ గార్డెన్‌ను అమలు చేస్తోంది. పేరుకు ఇది బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఇలా గ్రామం, మండలం, జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన పాఠశాలలకు ప్రభుత్వం ఏడాదికి రూ.5 వేలు మంజూరు చేస్తోంది. ఈ సొమ్మును ఆయా మండలాల ఎంఈవోలకు అక్కడి నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ఖాతాకు జమ చేస్తున్నారు. ఇది కనుక పూర్తిస్థాయిలో అమలైతే మధ్యాహ్న భోజన పథకం సూపర్ సక్సెస్ అవుతుందని భావిస్తూ ఈ ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేశారు. అయితే వివిధ కారణాలతో పాఠశాలల్లో అమలు కాకపోవడంతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది. పైగా నిధులు కూడా పక్కదారి పడుతున్నాయి.

పాఠశాలలో మైదానం, నీటి సౌకర్యం, రక్షణతో కూడిన ప్రహరీ ఉన్న పాఠశాలలను ఎంపిక చేశారు. ఇలా జిల్లాలోని 30 మండలాల్లో 285 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కూడా ఉన్నాయి. ఒక్కో మండలం నుంచి కనిష్టంగా రెండు నుంచి గరిష్టంగా 17 పాఠశాలలను ఎంపిక చేశారు. మొక్కలు నాటడం నుంచి నీళ్లు పోసి వాటిని రక్షించడం వరకు అయిదుగురిని భాగస్వాములను చేశారు. అక్కడ పండించిన కూరగాయలను అక్కడే వినియోగిస్తే మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఆర్థికభారం తగ్గడంతో పాటు సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో పండించే వీటిలో పోషక విలువలు పెరిగి విద్యార్థులు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నది ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం 2017లో ఈ పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఈ క్రమంలో ఎంపిక చేసిన పాఠశాలలకు రూ.5 వేల చొప్పున చెల్లించేంది. అప్పటి నుంచి ఈ పథకం అమలులో ఉన్నా 2019 అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కిచెన్ గార్డెన్లకు నిధులు చెల్లించలేదు. తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నుంచి కిచెన్ గార్డెన్‌లను పునః ప్రారంభించింది. ఇలా జిల్లాల్లో 285 పాఠశాలలకు సంబంధించి ఒక్కో పాఠశాలకు మండల విద్యాశాఖాధికారికి అక్కడి నుంచి హెచ్‌ఎంల ఖాతాలకు రూ.5 వేలు చెల్లిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. నిర్దేశిత పాఠశాలల్లో కిచెన్‌లు గార్డెన్లు కనిపించడం లేదు. ఇదేమని హెచ్‌ఎంలను ప్రశ్నిస్తే నీరు అందుబాటులో లేదని, కోతులు, పశువులు ప్రవేశించి మొక్కలు తినేస్తున్నాయని, గుర్తు తెలియని వ్యక్తులు రాత్రివేళల్లో ధ్వంసం చేస్తున్నారని, కష్టపడి మొక్కలు పెంచినా రక్షణ లేదని, తదితర కారణాలు చెబుతున్నారు. ఈ నిధులను ఎంఈవోలు కొందరు వారి ఖాతాలోనే నిల్వ ఉంచుకోగా, మరికొందరు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాలకు జమ చేసినట్లు చెబుతున్నారు. అయితే ఈ నిధులు ఏమయ్యాయో ఎంఈవోలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకే తెలియాలి. అలాగే పాఠశాలలో మైదానం లేనిచోట పాఠశాల పైభాగంలో (టెర్రస్ గార్డెన్) అమలు చేస్తున్నారు.



రామసముద్రం మండలంలో కిచెన్ గార్డెన్‌కు ఎంపిక చేసిన దాసర్లపల్లె ప్రాథమిక పాఠశాల



నిమ్మనపల్లె మండలంలోని కొండయ్యగారిపల్లె ప్రాథమిక పాఠశాల

గత ఏడాది నిధులు విడుదల

గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కిచెన్ గార్డెన్‌కు నిధులు విడుదలయ్యాయి. ఏడాదికి ఒకసారి మాత్రమే పాఠశాలకు రూ.5 వేల చొప్పున ప్రభుత్వం ఇస్తుంది. ప్రస్తుతం ఎంపికైన పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో కిచెన్ గార్డెన్ ఉంటేనే నిధులకు రెకమెండ్ చేస్తాం. కొత్తగా చేస్తామని ముందుకు వచ్చే పాఠశాలలను కూడా ఈ జాబితాలో చేర్చి ప్రోత్సహిస్తాం. ఇప్పటికే ఎంపిక చేసిన పాఠశాలల్లో కిచెన్ గార్డెన్‌లు అమలయ్యేలా చూస్తాం.

- సుబ్రహ్మణ్యం, డీఈవో.

మద్యపానంతోనే అనర్థాలు

- ఈఎస్ మధుసూదన్



ప్రభుత్వాస్పత్రిలోని డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న ఈఎస్ మధుసూదన్

మదనపల్లె టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మద్యపానంతో ఆరోగ్యం పాడు కావడం, ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. శనివారం స్థానిక టమోటా మార్కెట్‌లో కూలీలకు మద్యపానంపై జరిగే అనర్థాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఈఎస్ మాట్లాడుతూ పగలంతా పడ్డ కష్టాన్ని మరచిపోవడానికి కొందరు మద్యానికి అలవాటు పడతారని, మద్యపానంతో శరీరంలోని అవయవాలన్నీ దెబ్బతింటాయన్నారు. మత్తులో మనిషి ఆవేశాలకు లోనై ఇతరులకు హానిచేసే అవకాశం ఉందని, నేరాలు జరిగి జైలుపాలు అవుతున్నారన్నారు. కొందరు గంజాయి, డ్రగ్స్ బారిన పడి కుటుంబాలను పట్టించుకోకుండా అనాథలను చేస్తున్నారన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని డీ అడిక్షన్ సెంటర్‌ను తనిఖీ చేసిన ఈఎస్ అక్కడ చికిత్స పొందుతున్న ఐదుగురిని పరామర్శించారు. చిన్నచిన్న రోగాలను భరించలేక మత్తుకు అలవాటు పడ్డ వారు మత్తువిమోచన కేంద్రంలో చికిత్స అనంతరం కోలుకుంటున్నారన్నారు. నెలలో ప్రతి రెండు, నాలుగో శనివారం జిల్లావ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో ఎక్సైజ్ ఏఈఎస్ జోగేంద్ర, సీఐ భీమలింగ, ఎంఈవో ప్రభాకర్ రెడ్డి, ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూవో గంగిరెడ్డి, డాక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

- వ్యవసాయ శాఖ జేడీ శివనారాయణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీఏ శివనారాయణ

రైల్వేకోడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సహజసిద్ధమైన వనరులతో వ్యవసాయం చేస్తే అధిక లాభాలు వస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ జేడీఏ శివనారాయణ తెలిపారు. శనివారం ప్రకృతి వ్యవసాయంపై మూడోరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అనేది గ్రామాల్లో సహజసిద్ధంగా లభించే వనరులతో సాగు చేసే పద్ధతి అన్నారు. దీంతో భూసారం బాగా పెరుగుతుందన్నారు. తెగుళ్ల సహజ నివారణ, పంటల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు కల్గించే విధంగా ఉంటుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారం ఇచ్చేందుకు దోహదపడుతుందన్నారు. రైతుల ఆరోగ్యంతో పాటు భవిష్యత్ తరాలకు పర్యావరణాన్ని కాపాడే ఆహారం అందుతుందన్నారు. రైల్వేకోడూరు వ్యవసాయ శాఖ ఏడీఏ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు వ్యవసాయ శాఖ కృషి చేస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు ఏటీఎం మోడల్, ఏ-గ్రేడ్ మోడల్, న్యూట్రి గార్డెన్లు ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ మోడల్స్ ద్వారా రైతులకు ప్రత్యక్షంగా ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలను చూపిస్తామన్నారు. తద్వారా రైతుల్లో ఉత్సాహం పెంచి ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించే ప్రయత్నం విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు, వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుమ్మణంగుట్ట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకులు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు

బి.కొత్తకోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మణంగుట్ట వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. కుప్పం, కదిరి, మదనపల్లె ప్రాంతాలకు చెందిన పలు ఫైనాన్స్ కంపెనీలు డైలీ, వీక్లీ కంతుల ప్రకారం చెల్లించే విధంగా బి.కొత్తకోటతో పాటు పొరుగు మండలాల్లోని అన్ని గ్రామాలలో అప్పులు ఇచ్చారు. వీటిని వసూలు చేసేందుకు కొందరిని నియమించుకున్నారు. వీరు రోజూ ద్విచక్ర వాహనాలలో వచ్చి అప్పులు తీసుకున్న వారి నుంచి కంతుల డబ్బు వసూలు చేసుకుని వెళతుంటారు. ఈ క్రమంలో కుప్పంకు చెందిన ఓ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులుగా పనిచేస్తున్న కుప్పం మండలం అనిమిగానిపల్లెకు చెందిన లోకేశ్ (20), అదే మండలంలోని కాకిమడుగు గ్రామానికి చెందిన వెంకటేశ్ (34)లు ద్విచక్రవానంలో ములకలచెరువు చుట్టుపక్కల గ్రామాలలో కలెక్షన్‌లు చూసుకుని మదనపల్లె వైపు తిరుగు ప్రయాణం అయ్యారు. హైవేలో తుమ్మణంగుట్ట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇరువురికీ తలకు బలమైన గాయాలు కావడంతో అధిక రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మౌలిక వసతులు కల్పించండి

- బాల్యవివాహాల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన వసతి గృహాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు సౌకర్యంగా ఉండేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గిరిజన పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చేపడుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించి హాస్టల్ వార్డెన్‌లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న మరమ్మతుల పనులను నాణ్యతతో చేపట్టడంతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం పాఠశాలలు, వసతి గృహాల్లో నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకు అందించాలన్నారు. ఏఎన్‌ఎంలకు కేటాయించిన విధులను పర్యవేక్షిస్తూ సక్రమంగా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న అమ్మాయిలు రెండు రోజుల కంటే ఎక్కువగా హాజరుకాని పక్షంలో సంబంధిత ఉపాధ్యాయులు, వార్డెన్లు స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విషయాన్ని తెలుసుకుని పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైతే దాతల సహకారం తీసుకుని ఏర్పాట్లు చేసేందుకు సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో బాల్యవివాహాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. బాల్య వివాహాలు అత్యంత ప్రమాదకరమని, ఏ ప్రాంతంలో జరిగినా నిరోధించేందుకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఫుట్‌పాత్‌లపైనే రామభక్తుల పడక

● రాత్రివేళలలో భక్తులకు రక్షణ కరువు




వాహనం, ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న భక్తులు

ఒంటిమిట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రెండో అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరాముని భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఒంటిమిట్ట కోదండరాముని ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని నిర్ణయించింది. ఆలయ అభివృద్ధికి 2015లో టీటీడీలో ఆలయాన్ని విలీనం చేసింది. టీటీడీవారు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారు కానీ భక్తులకు ఆలయ సమీపంలో సరైన వసతి సౌకర్యాలు కల్పించలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ వారు రూ.100 కోట్లు కేటాయించి అందులో సగం పైగా ఖర్చు పెట్టినా భక్తులకు కనీస వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో ఇక్కడ బస చేసే భక్తులకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీటీడీ వారు ఆలయ సమీపంలో కాకుండా కల్యాణవేదిక వద్ద గదులను నిర్మించారు. అవి ఆలయానికి దూరంగా ఉండడంతో భక్తులు అక్కడికి వెళ్లలేకపోతున్నారు. దీంతో రాత్రివేళలో ఇక్కడే బస చేసే భక్తులు ఫుట్‌పాత్‌లపైన, ఆరుబయట నిద్రించాల్సి వస్తోంది. మరికొంతమంది వారి వాహనాలపైనే నిద్రిస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నవారికి పలు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా దొంగల బెడద ఉంటుందేమోనని భయపడుతున్నారు. ఈ మధ్యనే ఆలయ సమీపంలో ఉన్న వెయిటింగ్ హాలులో భక్తులు విశ్రాంతి తీసుకుంటుండగా రాత్రి వేళల్లో తమ సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వెయిటింగ్ హాలులోనే భద్రత లేనప్పుడు ఆరుబయట ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న భక్తులకు రక్షణ ఎలా ఉంటుందని భక్తులు పేర్కొన్నారు.

మరోపక్క వర్షం, దోమల బెడద కూడా భక్తులకు తప్పడం లేదు. రాత్రివేళల్లో ఇక్కడ బస చేయకుండా కొంతమంది భక్తులు కోదండరాముని దర్శనం లేకుండానే వెళ్లిపోతున్నారు. మరికొంతమంది ఫుట్‌పాత్‌లపైనే నిద్రిస్తూ వేకువజామునే కోదండరాముని దర్శించుకుని వెళుతున్నారు. దూర ప్రాంతాల నుంచి కోదండరాముని దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో వారికి దర్శనభాగ్యం దక్కక నిరాశగా వెళుతున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి ఆలయ సమీపంలో వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసి రాత్రివేళల్లో భక్తులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



కోదండరాముడి దర్శనం కోసం వచ్చే భక్తులకు వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి భక్తులకు సౌకర్యాలు కల్పించాలి.

\- శ్రీనివాసులు, రామభక్తుడు, ఒంటిమిట్ట

రాత్రివేళ భక్తులకు ఇబ్బందులు



కోదండరాముని దర్శనానికి విచ్చేసే భక్తులు రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నారు. బస చేసేందుకు వసతి సౌకర్యాలు లేకపోవడంతో ఆరుబయటనే నిద్రిస్తున్నారు.

\- భాస్కర్‌రెడ్డి, ఒంటిమిట్ట

'నవోదయ'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలంలోని నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే యేడాది చేరే విద్యార్థులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.గంగాధరణ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో 9వ తరగతిలోని ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతిలో చేరవచ్చునన్నారు. దరఖాస్తు ఫారాలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం సెప్టెంబరు 9వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ప్రవేశ పరీక్ష 2026 ఫిబ్రవరి నెల 7వ తేదీ ఉంటుందన్నారు.

11వ తరగతిలో ప్రవేశ పరీక్ష

2026-27లో 11వ తరగతిలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన కడప, అన్నమయ్య జిల్లాల్లోని 25-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు ఫారాలు రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 23న ఆఖరి తేదీగా నిర్ణయించామని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 7న ఉంటుందని వివరించారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

సుండుపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణం చేస్తున్నారని నోటీసులు ఇచ్చిన ఆపడం లేదని ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు శనివారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజుల నుండి మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీ చీనేవాండ్లపల్లెకి ఓ మహిళ అక్రమ నిర్మాణం చేస్తున్నారని ఆపివేయాలని జిల్లా అధికారులు, నియోజకవర్గ పంచాయతీ అధికారులు, మండల అభివృద్ధి, పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చిన హెచ్చరించిన అక్రమ నిర్మాణం ఆపకపోవడంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు శనివారం ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫారెస్ట్ కేంద్రం ఆకస్మిక తనిఖీ



భాకరాపేట ఫారెస్ట్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న స్క్వాడ్ డీఎఫ్‌వో

సిద్దవటం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి భాకరాపేట గ్రామంలో ఫారెస్ట్ తనిఖీ కేంద్రాన్ని శనివారం స్క్వాడ్ డీఎఫ్‌వో టి.శేఖర్‌బాబు ఆకస్మిక తనిఖీ చేపట్టి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ ఫారెస్ట్ తనిఖీ కేంద్రంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని తనిఖీ చేపట్టాలన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచందనాన్ని కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సిద్దవటం, కడప, ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో తనిఖీలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ రేంజర్ మదన్‌మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్



స్మగ్లర్, ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ సిబ్బంది

ఓబులవారిపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాదెల అటవీ ప్రాంతంలో తమిళనాడు ప్రాంతానికి చెందిన స్మగ్లర్‌ను అరెస్టు చేసి 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వేకోడూరు ఫారెస్ట్ రేంజర్ శ్యామ్‌సుందర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం గాదెల అటవీ ప్రాంతంలో తనిఖీ చేస్తుండగా ఊరగాయకొండ పరిధిలో తమిళనాడులోని తిరువన్నామలై జిల్లాకు చెందిన ఆనందన్‌రాజ్ జయశంకర్ అనే స్మగ్లర్‌ను పట్టుకున్నామన్నారు. అలాగే ఎనిమిది దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎంవీ రమణ, మహేష్‌కుమార్, ఫారెస్ట్ బీట్ అధికారులు జనార్దన్, పీరయ్య, నాగేశ్వరనాయక్, దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు వితరణ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

పీలేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పీలేరుకు చెందిన వ్యాపారి పామిడి మల్లికార్జున గుప్త తన షష్టి పూర్తికి కుటుంబసభ్యులు, బంధువులనే కాకుండా పీలేరు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ఆహ్వానించి వారికి దుస్తులు వితరణ చేశారు. అందజేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. పామిడి మల్లికార్జున గుప్త కేవలం వ్యాపారంలోనే కాకుండా లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య సంఘం, వాసవీ కపుల్స్, అవోపా వంటి సంఘాల్లో చురుగ్గా ఉంటూ సామాజిక సేవ చేస్తుంటారు. ఆయన శనివారం తన షష్టి పూర్తి చేసుకునే క్రమంలో కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సమాజానికి సేవలందించిన 60 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం... నిందితులకు శిక్ష పడాలి

కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలి : అదనపు ఎస్పీ వెంకటాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరచి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, అలాగే సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నిందితులకు శిక్షపడేలా కృషి చేయాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పోలీసుస్టేషన్‌లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పకటిప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టుల్లో చార్జ్‌షీట్ ఫైల్ చేసిన అనంతరం కోర్టు ద్వారా సంబంధిత కేసుల్లో సీసీ నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎప్పటికప్పుడు పెండింగ్ సమన్లు జారీ అయ్యేలా, వారెంట్లు అమలు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నూతనంగా అమల్లోకి వచ్చిన బీఎస్ఎస్ఎస్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కొత్త చట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలని ఆయన ఆదేశించారు. ప్రతి కోర్టు కానిస్టేబుల్ విధిగా తన పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి కోర్టులో హాజరవుతున్న ప్రతి కేసు గురించి అవగాహన పెంచుకుని సరైన సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. కోర్టు ట్రయల్ సందర్భంలో సంబంధించి స్టేషన్ హౌస్ అధికారి కూడా సమర్థవంతంగా కేసు విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కోర్టుల మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ జి.ఆదినారాయణరెడ్డి, ఎస్‌ఐ రవికుమార్, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జేబు కత్తిరించి డబ్బు కొట్టేసే యత్నం



దొంగను పోలీసుకు పట్టిస్తున్న బాధితుడు

● దొంగను పట్టుకున్న బాధితుడు

మదనపల్లె అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జేబు కత్తిరించి డబ్బు కొట్టేయాలనే ప్రయత్నం విఫలమైన సంఘటన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. శనివారం ఉదయం కురబలకోట మండలం ఆర్‌సీ కురవపల్లెకు చెందిన శంకర అనే వ్యక్తి తన తల్లితో కలిసి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వచ్చి ఓపీ తీసుకున్నాడు. డాక్టర్ వద్ద చూపించుకుని మాత్రలు తీసుకునే సమయంలో రద్దీగా ఉండడంతో దొంగ జేబు కత్తిరించి అందులో ఉన్న డబ్బులు రూ.70 వేలు కొట్టేశాడు. గమనించిన బాధితుడు దొంగను పట్టుకున్నాడు. జేబు కట్ చేసినప్పుడు నోట్లు కూడా కట్ అయ్యాయి. తమ్ముడికి చెందిన డబ్బులు బ్యాంకులో చెల్లించడానికి తెచ్చానని, ఆస్పత్రిలో తల్లికి చూపించుకుని బ్యాంకుకు వెళ్లేలోపే ఇలా జరిగిందని వాపోయాడు. ఆస్పత్రి అవుట్ పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని టూటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్ర తెలిపారు.

మద్యం మత్తులో ఘర్షణ



ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పడేసిన మద్యం బాటిల్స్

మదనపల్లె అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రి ఆవరణలో మద్యం మత్తులో ఇరువురు అంబులెన్స్ డ్రైవర్లు ఘర్షణ పడిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. కొందరు అంబులెన్స్‌ల డ్రైవర్లు ఆస్పత్రి ఆవరణలోని తమ వాహనాల్లోనే మద్యం తాగుతున్నారు. శుక్రవారం రాత్రి కూడా ఇరువురు మద్యం తాగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో వచ్చాయి. రోజూ అంబులెన్స్ డ్రైవర్లు ఇక్కడే ఉంటూ తమ వాహనాలను ఆస్పత్రి చివరిలో ఉంచుకుని అక్కడ మద్యం తాగి ఖాళీ సీసాలను కూడా అక్కడే పడేస్తున్నారు. మద్యం ఎక్కువై ఆస్పత్రికి వస్తున్న వారిపైనో, లేక అంబులెన్స్ మరో డ్రైవర్లపైనా గొడవకు దిగుతున్నారు. మద్యం మత్తులో ఆస్పత్రికి వచ్చే రోగులకు, ప్రజలు చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిన ఆస్పత్రికి వచ్చే వారు కోరుతున్నారు.

జిల్లాలో 45 మంది వీఆర్వోల ఆకస్మిక బదిలీలు

కలికిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 45 మంది గ్రేడ్-1 వీఆర్వోలను బదిలీ చేస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం రాత్రి ఆలస్యంగా ఈ జాబితా విడుదలైంది. బదిలీల జాబితాలో ఉన్న వారిలో ఒకరు కడప జిల్లా, మరొకరు చిత్తూరు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీ కాగా 43 మందిని వివిధ మండలాల నుంచి బదిలీ చేశారు. అత్యధికంగా మదనపల్లె నుంచి 10 మందిని బదిలీ చేశారు. అదే విధంగా రాయచోటి నుంచి 9 మందికి స్థాన చలనం కలిగించారు. పుల్లంపేట నుంచి ముగ్గురు, రాజంపేట నుంచి ముగ్గురు, కురబలకోట నుంచి ముగ్గురు బదిలీ అయ్యారు. వాల్మీకిపురం, కలికిరి, పీలేరు, నిమ్మనపల్లె మండలాల నుంచి ఇద్దరేసి వంతున వీఆర్వోలు బదిలీ అయ్యారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె, చిన్నమండెం, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, గుర్రంకొండ, పీటీఎం మండలాల నుంచి ఒక్కొక్కరు వంతున బదిలీ అయ్యారు. మదనపల్లె నుంచి పలు ఆరోపణల కారణంగా భారీగా వీఆర్వోలకు స్థాన చలనం కలిగించి వివిధ మండలాల నుంచి ఏరికోరి కొంతమందిని అక్కడికి బదిలీ చేసినట్లు సమాచారం. బదిలీ జాబితాలో ఉన్న వారందరినీ ఆయా తహసీల్దార్లు వెంటనే రిలీవ్ చేయాలని, అదేవిధంగా బదిలీ అయిన వారు తక్షణం చార్జి అప్పగించి కొత్త స్థానాల్లో చేరిపోవాలని ఆదేశించారు. సోమవారంలోగా మరో 50 మంది వరకు గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేయనున్నట్లు సమాచారం.

నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశాలు

సుండుపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె పంచాయతీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రిలో శనివారం వచ్చిన కథనానికి జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ స్పందించారు. నిధుల దుర్వినియోగంపై క్షుణ్ణంగా విచారణ నిర్వహించాలని రాజంపేట డీఎల్పీవో మస్తాన్‌వలిని విచారణ అధికారిగా నియమించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి సమాచారంతో నివేదికను అందించేలా ఆదేశించామన్నారు. ఏడు రోజుల్లో విచారణ చేసి పైఅధికారులకు నివేదికను అందజేస్తానని రాజంపేట డీఎల్పీవో మస్తాన్‌వలి తెలిపారు.

ఇంటర్ విద్యలో నూతన సంస్కరణలు

● ఇంటర్ విద్య జిల్లా అధికారి రవి

రాయచోటిటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యలో నూతనంగా తీసుకొచ్చిన సంస్కరణలపై అధ్యాపకులకు అవగాహన అవసరమని ఇంటర్ విద్య జిల్లా అధికారి ఎస్.రవి తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఇంటర్ విద్య జిల్లా కార్యాలయంలో యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఈ విద్యా సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన సంస్కరణలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిలబస్ మార్పు, సబ్జెక్టు కలయిక (కాంబినేషన్) ప్రశ్నపత్రంలో మార్పుల గురించి వివరించారు. ఇంటర్ చదివే విద్యార్థులు ప్రధానంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు తీసుకుంటారన్నారు. ఈ గ్రూప్ సబ్జెక్టులతో పాటు పార్ట్-1గా ఇంగ్లీషు, పార్ట్-2లో ద్వితీయ భాషగా తెలుగు, సంస్కృతం, ఉర్దూ, అరబిక్, తమిళ, కన్నడ, ఒరియా, పర్షియన్, ఫ్రెంచ్ గానీ, ప్రధాన సబ్జెక్టులైన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమెస్ట్రీ, బయాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్, కెమెస్ట్రీ, సివిక్స్ గానీ, మైనర్ సబ్జెక్టులైన జియోగ్రఫీ, లాజిక్, పబ్లిక్, అడ్మినిస్ట్రేషన్, మోడర్న్ లాంగ్వేజ్ ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూల్లో ఏదైనా ఒక సబ్జెక్టులను ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు.

ఎంపీసీ విద్యార్థులు అడిషినల్‌గా (6వ సబ్జెక్టుగా) ఆప్షనల్ సబ్జెక్టు బయాలజీ, బైపీసీ విద్యార్థులు అడిషనల్‌గా (6వ సబ్జెక్టుగా) ఆప్షనల్ సబ్జెక్టు మ్యాథ్స్ ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఈ అడిషనల్ సబ్జెక్టును విద్యార్థులు సొంతంగా చదువుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మ్యాథ్స్-ఎ, మ్యాథ్స్-బీ సబ్జెక్టులను విలీనం చేసి మ్యాథ్స్ సబ్జెక్టుగా, బాటనీ, బయాలజీ సబ్జెక్టులను విలీనం చేసి బయాలజీ సబ్జెక్టుగా ఈ ఏడాది మొదటి సంవత్సరం విద్యార్థులకు అమలు చేస్తారన్నారు. ద్వితీయ సంవత్సరంలో గ్రూప్‌లో కానీ, సబ్జెక్టుల విలీనం కానీ, ప్రశ్నపత్రంలో మార్పులు కానీ చోటు చేసుకోలేదన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలోనూ మార్పులు ఉంటాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఏవైనా అనుమానాలుంటే నివృత్తి చేసుకోవటానికి సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.



ప్రిన్సిపాళ్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో రవి

ప్రాజెక్టులున్నా.. నీరు సున్నా...

● సమస్యల వలయంలో రైల్వేకోడూరు
● జిల్లా కేంద్రానికి ఒక్క బస్సూ లేదు...
● మంత్రి గారూ... మీరైనా పట్టించుకోండి...



వాగేటికోన మైనర్ ప్రాజెక్టు కట్టాల్సిన ప్రాంతం



మూతపడిన అఫ్సా జ్యూస్ ఫ్యాక్టరీ

రైల్వేకోడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఆదివారం నియోజకవర్గంలో పర్యటించనున్న సందర్భంగా నియోజకవర్గంలో ప్రాజెక్టులతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో వాగేటికోన, గొట్టిమానుకోన, చాకిరేవుకోన తదితర మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులున్నాయి. ఈ ప్రాజెక్టులకు ప్రతి ఏటా పనులు జరుగుతున్నా రైతుల పొలాలకు నీరందించిన పాపాన పోలేదు. ఈ ప్రాజెక్టులు కాంట్రాక్టర్లకు కల్పతరువులుగా మారుతున్నాయి. ఓబులవారిపల్లె మండలంలోని గాదెల సమీపంలో బండిరేవులకోన ఉంది. 30 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టును పట్టించుకున్న పాపానపోలేదు. చాలాసార్లు గత ఎమ్మెల్యేలు పరిశీలించినా ప్రయోజనం కనిపించలేదు.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో కాంట్రాక్టర్లకు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కాసులు కురిపిస్తున్నాయి. రైల్వేకోడూరు నియోజకవర్గానికి మరో కోనసీమగా పేరు ఉంది. ఇక్కడ మామిడి, బొప్పాయి, అరటి తదితర పంటలను రైతులు పండిస్తున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇక్కడి రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచి నాణ్యమైన పంటలను పండిస్తున్నా గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. అనంతరాజుపేట వద్ద అప్సా జ్యూస్ పరిశ్రమ ఉంది. ఇది మూతపడి 25 ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు పునఃప్రారంభానికి పాలకులు ప్రయత్నాలు చేయలేదు. రైల్వేకోడూరులో రైతులకు శీతల గిడ్డింగులు లేని కారణంగా పంటను దాచుకుని గిట్టుబాటు ధరలు వచ్చి అమ్ముకోవడానికి వీలుగా ఉంటుందని చాలాసార్లు పాలకులకు విన్నపాలు చేసుకున్నా ఫలితం శూన్యం. రైల్వేకోడూరు నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటికి ఒక్క బస్సు కూడా లేదు. అది కూడా రాయచోటికి వెళ్లి రావాలంటే ఒక్కరోజు సమయం పూర్తిగా అయిపోతోంది. ప్రజలు అష్టకష్టాలుపడి రాయచోటికి చేరుకుంటున్నారు. కలెక్టర్, ఎస్పీ తదితర కార్యాలయాలకు వెళ్లి రావాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. రైల్వేకోడూరును బాలాజీ జిల్లాలో కలపాలని ఏళ్ల తరబడి ప్రజలు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో కూడా రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో కలపాలని నాయకులు పట్టుబట్టినా ఎవరూ పట్టించుకోలేదు. జిల్లాల పునర్విభజన కమిటీలో ఉన్న మీరైనా మా గురించి పట్టించుకోండని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

రైల్వేకోడూరు నియోజకవర్గ కేంద్రంలో గుంజనేరు, ముష్టేరు, గుండాలేరు తదితర నదులు ఉన్నాయి. వీటికి రక్షణ గోడలు లేక వ్యవసాయ భూములు కోతకు గురి కావడమే కాకుండా నదీపరివాహక ప్రాంతాల్లో నివాసాలు ఉన్నా ప్రజల ఇళ్లు భారీ వర్షాల కారణంగా కొట్టుకునిపోతున్నాయి. నాలుగు లేన్ల దారి పనులు మొదలు కాలేదు. దీంతో భారీ వాహనాలు మొత్తం రైల్వేకోడూరు మీదుగా వెళుతున్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. ప్రతి ఏటా ఏనుగులు పంట పొలాలపై పడి నాశనం చేస్తున్నాయి. దీని పరిష్కారం చేయాలని ప్రభుత్వాలకు చాలా ఏళ్లుగా విన్నపాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. శనివారం ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేటకు తొలిఅడుగు కార్యక్రమానికి హాజరవుతున్న నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నియోజకవర్గ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కండిషన్ లేని బస్సులు..

ప్రయాణికుల పాట్లు

మూడేళ్లుగా ఎంఎఫ్ సీటు ఖాళీ.. ● షెడ్యూలు ప్రకారం బస్సులు నడవడం కూడా అనుమానమే..

"సురక్షిత ప్రయాణం ఆర్టీసీ లక్ష్యం.." "ఆర్టీసీ బస్సులో ప్రయాణించండి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోండి" అన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నినాదాలు కడప ఆర్టీసీ డిపో పరిధిలో అపహాస్యంగా మారుతున్నాయి. ఈ డిపో నుంచి బయలుదేరిన బస్సు గమ్యస్థానానికి సక్రమంగా చేరుతుందా.. ఒకవేళ చేరినా డిపోకు తిరిగి వస్తుందా అన్న విషయంపై డిపో సిబ్బందే సంశయం వ్యక్తం చేస్తుండడంతో ప్రయాణికులు అవాక్కవుతున్నారు. కండిషన్ లేకపోవడం కారణంగా షెడ్యూలు ప్రకారం బస్సులు నడవకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులకు ఆదాయంపై ఉన్న శ్రద్ధ వాహనాల నిర్వహణపై కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.



బస్సుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



కడప ఆర్టీసీ బస్టాండు ముఖద్వారం

కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్టీసీకి చెందిన బస్సులు 86, 48 అద్దె బస్సులు వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. కడప-బెంగుళూరు సర్వీసుల కారణంగా ఈ డిపోకు అత్యధికంగా ఆదాయం చేకూరుతోంది. ఇతర రూట్ల సంగతి పక్కన పెడితే, గణనీయంగా ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఈ మార్గంలో నడిచే బస్సుల కండిషన్‌లో లోపం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత డిపో యాజమాన్యంపై ఉంది. అయితే, సంబంధిత అధికారులుగానీ, సిబ్బంది గానీ బస్సుల కండిషన్‌పై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొరాయిస్తున్న బస్సులు

పక్షం రోజుల క్రితం కడప డిపో నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బెంగుళూరుకు వెళ్లాల్సిన అమరావతి బస్సు సరైన కండిషన్‌లో లేని కారణంగా సాయంత్రం 6 గంటలకు బయలుదేరింది. దీంతో ఆ బస్సుకు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు గగ్గోలు పెట్టినట్లు సమాచారం. అంతలా బస్సుల కండిషన్ అధ్వాన స్థితికి చేరిందనే విమర్శలున్నాయి.

ఖాళీగా మెకానికల్ ఫోర్‌మన్ పోస్టు

కడప ఆర్టీసీ గ్యారేజీలో 76 మంది రెగ్యులర్ ఉద్యోగులుండగా, మరో 20 మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ఐటీఐ చేసిన వారే ఎక్కువగా ఉన్నారు వారంతా షిఫ్ట్‌ల ప్రకారం క్లీనింగ్, వాషింగ్, తదితర పనులు చేస్తుంటారు. అయితే, వారికి బస్సుల కండిషన్‌పై అంతగా అవగాహన ఉండదని అంటున్నారు. ఆ అంశంలై పూర్తి అవగాహన కలిగి ఉండే మెకానికల్ ఫోర్‌మన్ పోస్టు మూడేళ్లుగా ఖాళీగా ఉండడంతో, ఆ బాధ్యతలను అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ (ఏ.ఎం.ఎఫ్) నిర్వహిస్తున్నాడు. ఆయన నిరంతరం చిర్రుబుర్రు లాడడమే పనిగా పెట్టుకున్నారు తప్ప బస్సుల కండి షన్‌పై దృష్టి సారించడం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. దీంతో కడప డిపో నుంచి ప్రయాణిక'లతో వెళ్లిన బస్సు తిరిగి డిపోకు చేరే వరకూ గ్యారంటీ లేదని గ్యారేజీ సిబ్బందిలో కూడా అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. దీనికి తోడు కడప డిపోలో కాలం చెల్లిన బస్సులే ఎక్కువగా ఉన్నాయనే గుసగుసలున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

కడప డిపోలో మెకానికల్ ఫోర్‌మన్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం. బస్సుల కండిషన్‌ను పరిశీలించి, ప్రయాణి కులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం..

- గోపాల్ రెడ్డి, ఆర్ఎం, కడప రీజియన్

హెలిప్యాడ్ ఏర్పాటు పనుల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి

జమ్మలమడుగు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రాక సందర్భంగా జమ్మలమడుగు మండలంలోని అంబవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను శనివారం ప్రొద్దుటూరు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమణారెడ్డి, జమ్మలమడుగు ఏడీఈ రాజగోపాల్, ఇతర అధికారులు పరిశీలించారు. జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు టిడ్కో గృహాల వెనుక భాగాన హెలిప్యాడ్ కోసం స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదురుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టు 1న ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించే స్థలాలను ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, సర్వేయర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందిస్తున్న గంజికుంట కుటుంబ సభ్యులు

చక్రాయపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళాన్ని అందించారు. శ్రావణ మాసం తొలి శనివారం పురస్కరించుకొని ప్రొద్దుటూరుకు చెందిన గంజికుట రాజమోహన్ జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని వరలక్ష్మి, మనుమడు ఉదయ్ కిర ణ్, మనుమరాలు లక్ష్మీప్రియ అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా వీరికి ప్రత్యే క దర్శనం కల్పించడంతో పాటు అర్చకులతో ఆశీర్వచనాలు అందించినట్లు అసిస్టెంట్ కమషనర్ తెలిపారు.

టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు లోమడ సుబ్బలక్షుమ్మ మృతి



చెన్నూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడప జిల్లా తెలుగుదేశంపార్టీ విశేష సేవలందించిన రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు లోమడ సుబ్బ లక్షుమ్మ(75) శనివారం మృతి చెందారు. చెన్నూరు మండలం శివాల పల్లెకు చెందిన లోమడ సుబ్బారెడ్డితో ఆమెకు వివాహం జరిగింది. .ఈమె ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ఉపాధ్యక్షురాలిగా ఆరేళ్లు పని చేశారు. 1995-97లో స్త్రీ శిశు సంక్షేమశాఖ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లాలో మహిళా సమస్యలపై ఎన్నోమార్లు పోరాటాలు చేశారు. గతంలో సుబ్బలక్షుమ్మ చేసిన కృషిని అభినందించేందుకు ప్రస్తుత సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆమె ఇంటికి కూడా వచ్చారు. కాగా, ఈమె భర్త లోమడ సుబ్బారెడ్డి రెండు నెలల క్రితం మృతి చెందగా, శనివారం ఆమె మృతి చెందడంతో టీడీపీ నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె అంత్యక్రియలు చెన్నూరు పెన్నానదీ తీరంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బైక్ ఢీకొని ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న జయరాం

కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిల బైక్ వీలింగ్ కారణంగా ఆర్టీసీ డ్రైవర్ గాయపడ్డాడు. కడప నగరంలోని 49వ డివిజన్ ఆలంఖాన్ పల్లెకు చెందిన జయరాం ఆర్టీసీ డ్రైవర్. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా ఆలంఖాన్‌పల్లె- దండు (కమలా నగర్) మధ్యలో కొందరు రెండు ద్విచక్ర వాహనాలతో వీలింగ్ చేస్తూ జయరాం నడుపుతున్న వాహనాన్ని ఢీకొన్నారు. దీంతో జయరాం కిందపడిపోయి గాయాలపాలయ్యాడు. స్థానికంగా ప్రథమ చికిత్స చేయించుకుని శనివారం ఉదయం కడప ఆర్ఎం కార్యాలయం సమీ పంలోని ఆర్టీసీ ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు పొందారు. కొన్ని నెలలుగా ఆకతాయిలు ఇష్టానుసారంగా ద్విచక్రవాహనాలను డ్రైవింగ్ చేస్తూ రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బైక్ ముందు చక్రాన్ని పైకెత్తి వెనుక చక్రం మీద వెళుతూ ఈలలు.. కేకలు వేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రహదారులపై ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

ముద్దనూరు జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చెన్నారెడ్డిపల్లె సమీపంలోని రైలు పట్టాలపై శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మృతదేహంపై తెలుపు రంగు ప్యాంటు, తెలుపు రంగు కట్ బనియన్ ఉందని, వయసు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందన్నారు. ఇతను ప్రమాదవశాత్తూ మృతి చెందాడా, ఆత్మహత్య చేసుకున్నాడా అన్న విషయం విచారణలో తేలాల్సి ఉందన్నారు. ఇతర వివరాల కోసం 9440627658 సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో భరత్‌యాదవ్ అరెస్టు

పులివెందుల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం చేసిన కేసులో భరత్‌యాదవ్‌ను శనివారం అరెస్టు చేసినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. దిలీప్‌కుమార్ హత్యకేసులో రాజీ కావాలంటూ శుక్రవారం ఆయన తల్లి మస్తానమ్మను భరత్‌యాదవ్ బెదిరించడంతోపాటు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, శనివారం నిందితుడిని అరెస్టు చేసి పులివెందుల సివిల్ కోర్టు జడ్జి ముందు హాజరుపరచగా, జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ వివరించారు

గంజాయి విక్రేతల అరెస్టు

● నాలుగు కేజీల గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కడప ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్

కడప క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్నట్లు సమా చారం అందడంతో కడప నగరంలోని పుట్లంపల్లె చెరువు వద్ద దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు కడప ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. కడప ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో శనివారం విలేక రులకు వివరాలు వెల్లడించారు. సీకేదిన్నె మండలం మామిళ్లపల్లెకు చెందిన రావులకొల్లు అజయ్ బద్వేలు టౌన్ రిక్షా కాలనీకి చెందిన కావడి శ్రీను, కడప ఇందిరానగర్‌కు చెందిన గంప మహేశ్, శివానందపురానికి చెందిన షేక్‌హుసేన్‌వలి, ప్రకాశ్‌నగర్‌కు చెందిన మల్లి, ఖాదర్ మొహిద్దీన్‌లు ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి, వాటిని ప్యాకెట్ల రూపంలోకి మార్చి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఆ మేరకు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల దాడుల సందర్భంగా పరారైన వారిని కూడా అరెస్టు చేసినట్లు వివరించారు.

భార్య చంపుతానని బెదిరించిందని భర్త ఫిర్యాదు

చెన్నూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తన భార్యే తనను చంపుతానని బెదిరించిందంటూ శివాలపల్లెకు చెందిన సుబ్బరాయుడు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. శివాలపల్లెకు చెందిన బత్తల సుబ్బరాయుడుకు భార్య శ్రీలతతోపాటు కుమారుడు ఉన్నారు. మూడు నెలల క్రితం ఇంట్లో 14 తులాల బంగారంతో తన స్వగ్రామమైన నంద్యాలకు వెళ్లి ఆమె తిరిగి రాకపోవడంతో, భర్త ఫోన్ చేసి ఆరా తీశాడు. ఇంటికి రావాలని కోరాడు. దాంతో ఆమె తాను సాయిగణేశ్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకున్నానని, తాను తీసుకు వచ్చిన బంగారం అతనికి కట్నంగా ఇచ్చానని, ఇక నీ దగ్గరకు రానని, అక్కడే ఉంటానని, కొడుకును బాగా చూసుకుంటానని చెప్పింది. గట్టిగా మాట్లాడితే చంపుతానని బెదిరించిందని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

● డీఆర్వో విశ్వేశ్వరనాయుడు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

చెన్నూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు పిలుపునిచ్చారు. చెన్నూరులో శనివారం చెన్నూరు యువత ఆధ్వర్యంలో స్థానిక చౌడేశ్వరి ఆలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగ విచ్చేసిన డీఆర్వో మాట్లాడుతూ రక్తదానం అనేది పుణ్యకార్యంగా భావించాలన్నారు., చెన్నూరు యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. రక్తదానంపై పలురకాల అపోహలు ఉంటాయని, వాటిని వదులుకుని సమాజ సేవలో భాగంగా ఆరోగ్యవంతమైన యువత ఏడాదిలో మూడు మార్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్తదానం చేయవచ్చన్నారు. దీంతో శరీరంలో మరింత చురుకుదనం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు రక్తదానం చేసిన యువతను అభినందించారు. అలాగే యువకులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇద్దరు మహిళలతో సహా 74 మంది రక్తదానం చేయగా, వారందరికీ ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, కోఆర్డినేటర్లు ఉట్టి శ్రీకాంత్, సునీల్, డీపీఎం భాస్కర్, మెడికల్ ఆఫీసరు వినయ్‌కుమార్‌రెడ్డి, చౌడేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు సుధామూర్తి, జేబీవీఎస్ అధ్యక్షుడు అశోక్, గుగ్గిళ్ల చాణక్య, పెడబల్లె శ్రీకాంత్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఓట్లు మావే.. సీట్లూ మావే !

● ఆత్మీయ సమావేశంలో బీసీ కులాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు

కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఓట్లు మావే.. సీట్లు కూడా మావే అనే నినాదంతో బీసీ వర్గాలను జాగృతం చేసి, రానున్న ఎన్నికల నాటికి శాసించే శక్తిగా మారుస్తామని బీసీ కులాల వేదిక నాయకులు ప్రకటించారు. స్థానిక పాతరిమ్స్‌లోని బీ.సీ.భవన్‌లో శనివారం రాయలసీమ జిల్లాల్లోని బీసీ కులాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పార్టీ ఎన్నికల ముందు బీసీల సంక్షేమానికి కృషి చేస్తామని గొప్పలు చెప్పడం.. గద్దెనెక్కగానే గాలికొదిలేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటివరకూ స్థానికంగా అధిక జనాభా గల కులాలకు మాత్రమే అన్ని పార్టీలు అవకాశం కల్పించాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అధిక జనాభా ఉన్న కులాలకు ప్రాధాన్యం లభించలేదన్నారు. ఇప్పటివరకూ రాజ్యాధికారంలో భాగస్వామ్యం లేని బీసీ కులాలను అసెంబ్లీ, పార్లమెంట్‌లోకి తీసుకుని పోయేలా బీసీల్లో చైతన్యం తెస్తామన్నారు. దాదాపు 150కి పైగా గల బీసీ కులాల్లో కేవలం ఐదారు కులాలకే పార్టీలన్నీ ప్రాధాన్యం కల్పిస్తున్నాయని, మిగిలిన కులాలను డబ్బులు లేవనో, జనాభా లేదనో చట్టసభలలో అవకాశం కల్పించడం లే`న్నారు. ఇక నుంచి అన్ని కులాలకు రాజ్యాధికారంలో అవకాశం కల్పించడమే లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

కార్యక్రమంలో బీసీ కులాల వేదిక నాయకులు ఇంటూరి బాబ్జి (నాయీ బ్రాహ్మణ సంఘం) జి. లలిత్ ప్రజాపతి (కుమ్మర శాలివాహనసంఘం) ఎన్ సాంబశివరావు (అగ్నికుల క్షత్రియ సంఘం) పి. మనోజ్‌కుమార్ (సంచార జాతుల సంఘం) సుబ్బయ్య, (దాసరి సంఘం) బద్వేల్ గురుమూర్తి (రజక సంఘం) తదితరులతోపాటుగా పలువురు బీసీ కులాల నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

● ఏడీఏ అంబవరం ప్రభాకర్‌రెడ్డి



ఆర్ఎస్‌కే సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

పులివెందుల రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విచక్షణా రహితంగా రసాయన ఎరువుల వినియోగంతో నిస్సారంగా మారిన నేలకు జవజీవాలందించడంతోపాటు, ఆరోగ్యకరమైన పంటలు అందించే ప్రకృతి వ్యవసాయం వైపు ఆకర్షితులయ్యేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు అంబవరం ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడులు ఎక్కువ కావడానికి విచ్చలవిడిగా రసాయన, పురుగు మందుల వాడకమే కారణమన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంతో తక్కువ పెట్టుబడితోనే పంటలు పండించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలకు మంచి ధర కూడా దక్కుతుందన్న విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పైరును ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి రైతుతో ప్రధాన మంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లించేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. చీడపీడలను గుర్తించి సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నత్రజని ఎరువులు అనవసరంగా వాడితే చీడపీడల ఉధృతి పెరిగి పంట దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ, అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు చెన్నారెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఓబులేసు, చంద్రశేఖర్‌రెడ్డి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో అనంతపురం, చిత్తూరు జట్లు

● హోరాహోరీగా ఏసీఏ అండర్-16 మెన్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం- కర్నూలు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 210 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 51.3 ఓవర్లలో కేవలం 125 పరుగులకే కుప్ప కూలింది. దీంతో రెండవ రోజున బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. సాత్విక్ 131 పరుగులు చేయడంతో అనంతపురం జట్టు 342 పరుగుల ఆధిక్యత సాధించింది.

నగర రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు- నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌లో చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 76.3 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 21 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 70 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 70 పరుగులతో రెండవ రోజున బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 103.5 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సుశాంత్ 60 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉండగా మరో బ్యాటర్ చైతన్య 52 పరుగులు చేశారు. రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 40 పరుగులు చేసింది. ఇందులో హర్ష 21 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో చిత్తూరు జట్టు 22 పరుగుల స్వల్ప స్కోర్ ఆధిక్యంలో నిలిచింది.

29న ఈశ్వరీదేవి జయంత్యుత్సవాలు



ఈశ్వరీదేవి మఠం ప్రాంగణం

బ్రహ్మంగారిమఠం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఈశ్వరీ దేవి అమ్మవారి 322వ జయంతి సందర్భంగా జూలై 29న ఈశ్వరీదేవి మఠం ప్రాంగణంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి శ్రీవీర శివకుమార స్వామి తెలిపారు. శనివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ అష్టోత్తర శత సామూహిక కలశోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు రూ.516లు సమర్పించి పేర్లను నమోదు చేయించుకున్న వారికి గోత్రనామాలతో అర్చన, కలశ పూజ చేసి, వస్త్రం, కొబ్బరికాయ, కలశాన్ని ఇస్తామన్నారు. కార్యక్రమాలన్నీ కార్యనిర్వాహణాధికారి బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఘనంగా ప్రారంభమైన శ్రావణ శనివారం పూజలు

● అన్నదానాలు, భక్తులతో కిటకిటలాడిన ఆంజనేయస్వామి ఆలయాలు



సుండుపల్లి: అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు



లక్కిరెడ్డిపల్లెలో భక్తులకు ప్రవచనాలు చెబుతున్నస్వామివారు

రాయచోటిటౌన్, జూలై26(ఆంధ్రజ్యోతి):పెళ్లిళ్లు, శుభకార్యాలకు అత్యంత అనుకూలమైన హిందువుల పవిత్ర మాసమైన శ్రావణ మాసం ఉత్సవాలు ప్రా రంభం సందర్భంగా రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో శ్రావణ మొ దటి శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం కమ్మపల్లిలో వెలిసిన ఆంజనేయస్వామి గుడిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించా రు. ముఖ్య అతిథిగా హాజరైన రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, అంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అలాగే మాండవ్యనది ఒడ్డున వెలిసిన ప్రాచీన ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయచోటి పట్టణ పరిధిలోని కుమ్మరపల్లికి సమీపంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు సురేశ్‌స్వామి ఆంజనేయస్వామికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగేంద్రనాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్‌వలి, గొర్లముదివేడు మాజీ సర్పంచ్ జిలానీబాషా, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు గుర్రం సుబ్బయ్యనాయుడు పాల్గొన్నారు.

సంబేపల్లె: మండల వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో తొలి శ్రావణ శనివారం పూజలను చేపట్టారు. శెట్టిపల్లి గ్రామం నరసారెడ్డిగారిపల్లె సమీపంలో పాలబండ వీరాంజనేయస్వామి ఆలయం, గుట్టపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రజలు విశేషంగా పాల్గొని పూజలు చేశారు.

రామాపురం: మొదటి శ్రావణ శనివారం సందర్భంగా మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో మహిళలు, ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయాలను అంగరంగ వైభవంగా సుందరీకరించారు. ఆలయాల కార్యనిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్తగా అన్నదానం, నీటి వసతి కల్పించారు. రాత్రికి చెక్కభజనలు, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

రైల్వేకోడూరు: మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మీనరసింహస్వామికి శనివారం శ్రావణమాస పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సాయిరాం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ప్రత్యేక అలకరణ చేశారు. అలాగే స్థానిక గాంధీ విగ్రహం వద్ద బోళాశంకర్ సేవా సమతి ఆధ్వర్యంలో సుమారు 400 మందికి అన్నదానం చే శా రు. ఈ సందర్భంగా బోళాశంకర్ వ్యవస్థాపకుడు మం దల నాగేంద్ర మాట్లాడుతూ ఆకలైన వారందరికి అన్నం పెట్టడానికి ఈ సేవను ఎంచుకున్నట్లు తెలిపారు. బోళాశంకర్ సేవా సమితి సభ్యులు సుబ్రహ్మణ్యం, సీహెచ్ రమేష్‌బాబు, బుడిగి శివయ్య, మల్లి, సుబ్బరాయుడు, బండారు మల్లి వాసా బాబు, నాగరాజ పాల్గొన్నారు.

సుండుపల్లె: ప్రసన్న వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు అమ్మనాయక్ తెలిపారు. ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురంలో వెలిసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పూజలు చేశారు. ఆంజనేయస్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే భైరవగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

లక్కిరెడ్డిపల్లె : దొర్రిచెరువు సమీపంలో వెలిసిన మాతాంగ పీఠంలో పూజలు నిర్వహించారు. మఠం పీఠాధిపతి మాతానందగిరి స్వామి శివపార్వతులకు మాతాంగ తల్లికి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. మాతానందగిరి స్వామి భక్తులకు ప్రవచనాలు వినిపించారు.

సిద్ధవటం: కనుమలోపల్లె వద్ద వెలసిన మందగిరి శనీశ్వరస్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సుబ్రమణ్యంశర్మ మాట్లాడుతూ ఒంటిమిట్ట, కడప, బద్వేల్, మాధవరం, సిద్దవటం తదితర గ్రామాల భక్తులు పూజల్లో పాల్గొన్నారన్నారు.

గాలివీడు: గాలివీడు మండలంలోని బ్రాహ్మణవీధి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రంగనాయకులు ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.



రైల్వేకోడూరు: అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి



రాయచోటి: ప్రత్యేక అలంకరణలో స్వామివారు



రామాపురం: అంజన్న ఆలయంలో పూజలు



రాయచోటి: స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి: కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

రాయచోటి(కలెక్టరేట్), జూలై26(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై దృష్టిల సారించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో స్వర్ణాంధ్ర పీ4, ఓటరు జాబితా సవరణ, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారాలు, సంక్షేమశాఖల హాస్టళ్లు, పాఠశాలల ఆకస్మిక తనిఖీలు తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఉన్న అధికారులు, సిబ్బంది స్వర్ణాంధ్ర పీ4 కార్యక్రమంలో పాలు పంచుకుని పేదవారికి చేయూతనివ్వాలని సూచించారు. తాను 10 కుటుంబాలు, సంయుక్త కలెక్టర్ 10 కుటుంబాలను దత్తత తీసుకున్నామన్నారు. ఆ ప్రభుత్వ ఉద్యోగులందరూ వారికి తోచిన సహాయాన్ని చేయాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లలో లోపాలు ఉంటే కఠిన చర్యలు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖ అధికారి సురేశ్

రాయచోటి(కలెక్టరేట్), జూలై26(ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టళ్లలో లోపాలు ఉంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా వెనుకబడిన సంక్షేమశాఖ అధికారి సురేశ్‌కుమార్ హెచ్చ రించారు. శనివారం సాయం త్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లాలోని వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టళ్ల నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలకు ఎప్పటికప్పుడు మెడికల్ చెకప్‌లు చేయించాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. నిర్వహణలో లోపాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు.

రక్తదానం పుణ్యకార్యం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రైల్వేకోడూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మెగా రక్తదాన వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి కడప జిల్లా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణంలో జేబీవీఎస్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం పుణ్యకార్యం అన్నారు. ప్రభుత్వ వైద్యుడు సాయికుమార్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రాజంపేట టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు రాధాకృష్ణ, సహాయ కార్యదర్శి సికిందర్ ఆటో వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం రాజంపేటలో ఆటో కార్మికులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో ఆటోలు నిలుపుకోవడానికి పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఆటో వర్కర్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

నందలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జిల్లా స్థాయిలో డీఆర్‌డీఏ సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ సిడ్యాప్ వారి ఆధ్వర్యంలో యవతకు డీడీయూజీకేవై ప్రోగ్రాం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఏపీఎం శ్రీహరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువతను గుర్తించి క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం, శిక్షణతో నిమిత్తం లేకుండా ఉపాధి కల్పించడం, స్వయం ఉపాధి పొందేందుకు సహకారం కల్పించనున్నట్లు సీ డ్యాప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి తెలిపారన్నారు. కావున నిరుద్యోగులు ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు మండల సమాఖ్యలో ప్రారంభమయ్యే శిబిరానికి హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏపీఎం కోరారు.

ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

చిట్వేలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఈనెల 28న రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద బొప్పాయ రైతులు గిట్టుబాటు ధర కోసం నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మణి మాట్లాడుతూ కిలోకు రూ.25 ధర కల్పించాలన్నారు.

'దళారులపై చర్యలు తీసుకోవాలి'

రైల్వేకోడూరు, రూరల్‌జూలై 26(ఆంధ్రజ్యోతి): బొప్పాయి రైతులను నడ్డివిరుస్తున్న దళారులపై ప్రభుత్వం చర్యలు తీసకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగవల్లి రంగారెడ్డి కోరారు. శనివారం రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు మండలాల్లో బొప్పాయి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, పెనగలూరు మండల కార్యదర్శి గానిగిపెంట ఆదినారాయణ, నాయకులు ఈ. లక్ష్మీనారాయణ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇకపై మార్కెట్ యార్డులో ప్రతి వారం సంత



మార్కెట్ యార్డులో పనులు చేయిస్తున్న చైర్మన్ షఫీనాయక్

లక్కిరెడ్డిపల్లె, జూలై26(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డులో ప్రతి వారం పశువులు, కూరగాయల సంతలు నిర్వహిస్తామని మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్ఎండీ డాక్టర్ షఫీనాయక్ తెలిపారు. శనివారం మార్కెట్ యార్డులో పనులు ప్రారంభించారు.

ఉపాధ్యాయులకు డీఏ, ఐఆర్ మంజూరు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గాలివీడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే డీఏ, ఐఆర్ వెంటనే మంజూరు చేయాలని అపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. శనివారం గాలివీడు మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. నరసింహులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సహాధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్ పాఠశాలలను పటిష్ట పరచాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రామేశ్వర్ మాట్లాడుతూ బదిలీ పొందిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు, జీతాలు అందజేయాలన్నారు. అపస్ గాలివీడు మండల అధ్యక్షుడు రెడ్డెయ్యరాజు, జిల్లా కార్యదర్శి రవీంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి నరేంద్రకుమార్, మండల కార్యదర్శి రెడ్డెయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు కవిత పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో పాత పద్ధతిని అమలు చేయాలి

రైల్వేకోడూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసుల్లో ఆన్‌లైన్ రిజిస్టర్ సేవలను రద్దు చేసి పాత పద్ధతినే కొనసాగించాలని వ్యకాసం జిల్లా అధ్యక్షుడు మణి తెలిపారు. శనివారం ఆయన పోస్టాఫీసు వద్ద వినియోగదారులతో మాట్లాడారు.

ఇసుక డంపింగ్‌పై విచారణ

సిద్దవటం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):ఇసుక డంపింగ్ స్థావరాలపై శనివారం అధికారులు విచారణ చేపట్టారు. టక్కోలి సచివాలయం వెనుక ఇసుక నిల్వ చేయడంతో తహసీల్దారు తిరుమలబాబు ఆదేశాలతో శనివారం టక్కోలి గ్రామం ఇన్‌చార్జి వీఆర్వో రజని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇసుక డంపింగ్ చేసిన వ్యక్తి ఎవరో పూర్తిగా విచారిస్తున్నామన్నారు. అధికారులకు నివేదిక అందిస్తామన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

చిట్వేలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పాత చిట్వేలిలో వెలసిన వరదరాజస్వామి ఆలయ జీర్ణోద్ధరణ సందర్భంగా లక్ష్మీదేవి, గోదాదేవి, గరుడ, ఆంజనేయ, జయ, విజయ, శిఖర, యంత్ర, ధ్వజా, బలిపీఠం, ప్రతిష్ఠ మహాకుంభాభిషేకం ఈనెల 27న ప్రారంభమై 31న ముగుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివార్ల కృపకు పాత్రులు అయి కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

నేరాలపై అవగాహన అవసరం

చిన్నమండెం, జూలై26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో హెల్మెట్, ట్రాఫిక్ ని యమనిబంధనల గురించి, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే 100కు ఫోన్ చేసినా లేదా తమకు నేరుగా ఫోన్ చేసినా తక్షణమే స్పందిస్తామన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు బయట పెట్టకుండా ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్ఐ అంజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

సంబేపల్లె, జూలై26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులతు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ శెట్టిపల్లెశాఖ బ్రాంచ్ మేనేజర్ అరుణకుమారి తెలిపారు. శెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామీణ బ్యాంక్ శెట్టిపల్లెశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శెట్టిపల్లి, పెద్దజంగంపల్లి, విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ట్రోఫీ, బహుమతులు అందజేశారు. శెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర, పెద్దజంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కూటమి నేతలు

రాజంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు శనివారం రాజంపేట పాత బస్టాండులో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ మాట్లాడుతూ దేశ సరిహద్దులను కాపాడేందుకు అనేక మంది సైనికులు తమ ప్రాణాలు పణంగా పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రమణ, మల్లికార్జున, కృష్ణ, హిమగిరియాదవ్ పాల్గొన్నారు.

మంత్రి కార్యక్రమానికి కార్యకర్తలు హాజరు కావాలి

ఓబులవారిపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మంగంపేటలో జరగనున్న సుపరిపాలన- తొలి అడుగు కార్యక్రమానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హాజరవుతారని టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గునిపాటి చెన్నరాయుడు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు మంగంపేట గ్రామ పంచాయతీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరు కానున్నారని, నాయకులు, కార్యకర్తలు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో మహిళకు గాయాలు

రాయచోటిటౌన్, జూలై26(ఆంధ్రజ్యోతి): సపోటా కాయలు కోసేందుకు వెళ్లి 11 కేవీ విద్యుత్ షాక్‌కు గురై రామలక్ష్మమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన రాయచోటి పట్టణం ఎస్ఎన్‌కాలనీలో చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రామలక్ష్మమ్మ తన నివాసం దగ్గర ఉన్నటువంటి సపోటా కాయలు కోసేందుకు ఇనుపక కడ్డీ తీసుకెళ్లింది. కాయలు కొట్టే సందర్భంలో పైన ఉన్న 11 కేవీలైన్‌ను గమనించకపోవడంతో ఇనుప కడ్డీ విద్యుత్‌లైన్‌కు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై గాయాలపాలయ్యింది. వెంటనే 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. టీడీపీ నాయకులు మిట్టా సంజీవరెడ్డి, 16వ వార్డు ఇనచార్జి సయ్యద్ ఫజిల్, స్థానికులు పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు.

గుండెపోటుతో న్యాయవాది మృతి



వెంకటసుబ్బయ్య (ఫైల్)

పెనగలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండూరు పంచాయతి పరిధిలో గల గ్రామంలో నివాసం ఉంటున్న న్యాయవాది అనుగోలు వెంకటసుబ్బయ్య(60) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వెలగచర్ల నివాసి అయిన వెంకటసుబ్బయ్య గత 20 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో జీవిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు కోర్టుల్లో ఆయన తన కక్షిదారులు తరపున ఎన్నో సివిల్, క్రిమినల్ కేసులు వాదించి విజయం చేకూర్చినట్లు సమాచారం. శనివారం వెలగచర్లలో మృతదేహానికి పలువురు ఘనంగా నివాళుర్పించారు.

బదిలీ అయిన టీచర్లకు జీతాలు చెల్లించాలి: యూటీఎఫ్



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, జూలై26(ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, జాబీర్ డిమాండ్ చేశారు. శనివారం ఉపాధ్యాయ సమస్యలపై డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలకు ముందు ప్రభుత్వం ఒక ప్రణాళికబద్ధంగా వ్యవహరించకపోవడం వల్ల బదిలీ పొందిన ఉపాధ్యాయులు రిలీవ్ కావడంలోనూ, పొజిషన్ ఐడీలు రూపొందించడంలోనూ, జీతాలు చెల్లించడంలోనూ ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందన్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం వలన జీతం మీద ఆధారపడిన ఉపాధ్యాయుల పరిస్థితి గందరగోళంగా మారిందని తెలిపారు. యాప్‌ల సంఖ్య తగ్గించినప్పటికీ ఒకే యాప్‌లో విపరీతమైన సమాచారాన్ని పొందుపరిచి నిరంతరం వాటిని పర్యవేక్షించుటకే సమయాన్ని వెచ్చించాల్సి వస్తోందన్నారు.
ప్రభుత్వం వెంటనే బోధనేతర కార్యక్రమాలను రద్దు చే యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు దావుద్దీన్, పురం వెంకట్రమణ, రాష్ట్ర కౌన్సిలర్ టీ. శివారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, జిల్లా ప్రచురణల విభాగం కన్వీనర్ కే. విజయకుమార్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు రవిప్రకాశ్, జిల్లా మున్సిపల్ విభాగం కన్వీనర్ సుధాకర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శివశంకర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గాలివీడువాసికి పురస్కారం



అవార్డును అందుకుంటున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి

గాలివీడు, జూలై26(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో నాథ్ డిల్లీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రధానం చేసే రాష్ట్రీయ పురస్కార్-2025 అవార్డును గాలివీడు వాసి ఆర్‌కే ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి అందుకున్నారు. ఈ అవార్డును హైకోర్టు జడ్జ్ జస్టిస్ టీ. అమర్నాథ్‌గౌడ్, తెలంగాణ మాజీ మంత్రి వేణుగోపాల్ ఆచార్య, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ బింగి నరేంద్రగౌడ్ ప్రదానం చేశారు. రామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో మెరుగైన సేవలు అందించినందుకు ఈ పురస్కారం లభించినట్లు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీఐ

రాయచోటిటౌన్, జూలై26(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని రాయచోటి ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్ సూచించారు. శనివారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల శ్రీనివాస ఐటీఐలో విద్యార్థులకు మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్ఐ హుస్సేన్‌బాషా, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, సిబ్బంది రాంమోహన్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త గంగిరెడ్డి మృతి

రామాపురం, జూలై26(ఆంధ్రజ్యోతి): నల్లగుట్టపల్లె పంచాయతీ కర్ణపువాండ్లపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త గంగిరెడ్డి బ్రెయిన్ షాక్‌కు గురై శనివారం మృతి చెందారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు అంజనారెడ్డి, శ్రీనివాసులు, శ్రీను, రమణయ్య యాదవ్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపైనే రామభక్తుల పడక

● రాత్రివేళలో భక్తులకు రక్షణ కరువు

ఒంటిమిట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రెండో అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరాముని భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఒంటిమిట్ట కోదండరాముని ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని నిర్ణయించింది. ఆలయ అభివృద్ధికి 2015లో టీటీడీలో ఆలయాన్ని విలీనం చేసింది. టీటీడీవారు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారు కానీ భక్తులకు ఆలయ సమీపంలో సరైన వసతి సౌకర్యాలు కల్పించలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ వారు రూ.100 కోట్లు కేటాయించి అందులో సగం పైగా ఖర్చు పెట్టినా భక్తులకు కనీస వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో ఇక్కడ బస చేసే భక్తులకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీటీడీ వారు ఆలయ సమీపంలో కాకుండా కల్యాణవేదిక వద్ద గదులను నిర్మించారు. అవి ఆలయానికి దూరంగా ఉండడంతో భక్తులు అక్కడికి వెళ్లలేకపోతున్నారు. దీంతో రాత్రివేళలో ఇక్కడే బస చేసే భక్తులు ఫుట్‌పాత్‌లపైన, ఆరుబయట నిద్రించాల్సి వస్తోంది. మరికొంతమంది వారి వాహనాలపైనే నిద్రిస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నవారికి పలు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా దొంగల బెడద ఉంటుందేమోనని భయపడుతున్నారు. ఈ మధ్యనే ఆలయ సమీపంలో ఉన్న వెయిటింగ్ హాలులో భక్తులు విశ్రాంతి తీసుకుంటుండగా రాత్రి వేళల్లో తమ సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వెయిటింగ్ హాలులోనే భద్రత లేనప్పుడు ఆరుబయట ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న భక్తులకు రక్షణ ఎలా ఉంటుందని భక్తులు పేర్కొన్నారు.

మరోపక్క వర్షం, దోమల బెడద కూడా భక్తులకు తప్పడం లేదు. రాత్రివేళల్లో ఇక్కడ బస చేయకుండా కొంతమంది భక్తులు కోదండరాముని దర్శనం లేకుండానే వెళ్లిపోతున్నారు. మరికొంతమంది ఫుట్‌పాత్‌లపైనే నిద్రిస్తూ వేకువజామునే కోదండరాముని దర్శించుకుని వెళుతున్నారు. దూర ప్రాంతాల నుంచి కోదండరాముని దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో వారికి దర్శనభాగ్యం దక్కక నిరాశగా వెళుతున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి ఆలయ సమీపంలో వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసి రాత్రివేళల్లో భక్తులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




వాహనం, ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న భక్తులు

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



కోదండరాముడి దర్శనం కోసం వచ్చే భక్తులకు వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి భక్తులకు సౌకర్యాలు కల్పించాలి.

- శ్రీనివాసులు, రామభక్తుడు, ఒంటిమిట్ట

రాత్రివేళ భక్తులకు ఇబ్బందులు



కోదండరాముని దర్శనానికి విచ్చేసే భక్తులు రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నారు. బస చేసేందుకు వసతి సౌకర్యాలు లేకపోవడంతో ఆరుబయటనే నిద్రిస్తున్నారు.

- భాస్కర్‌రెడ్డి, ఒంటిమిట్ట

'నవోదయ'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలంలోని నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే యేడాది చేరే విద్యార్థులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.గంగాధరణ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో 9వ తరగతిలోని ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతిలో చేరవచ్చునన్నారు. దరఖాస్తు ఫారాలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం సెప్టెంబరు 9వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ప్రవేశ పరీక్ష 2026 ఫిబ్రవరి నెల 7వ తేదీ ఉంటుందన్నారు.

11వ తరగతిలో ప్రవేశ పరీక్ష

2026-27లో 11వ తరగతిలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన కడప, అన్నమయ్య జిల్లాల్లోని 25-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు ఫారాలు రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 23న ఆఖరి తేదీగా నిర్ణయించామని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 7న ఉంటుందని వివరించారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

సుండుపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణం చేస్తున్నారని నోటీసులు ఇచ్చిన ఆపడం లేదని ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు శనివారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజుల నుండి మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీ చీనేవాండ్లపల్లెకి ఓ మహిళ అక్రమ నిర్మాణం చేస్తున్నారని ఆపివేయాలని జిల్లా అధికారులు, నియోజకవర్గ పంచాయతీ అధికారులు, మండల అభివృద్ధి, పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చిన హెచ్చరించిన అక్రమ నిర్మాణం ఆపకపోవడంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు శనివారం ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫారెస్ట్ కేంద్రం ఆకస్మిక తనిఖీ



భాకరాపేట ఫారెస్ట్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న స్క్వాడ్ డీఎఫ్‌వో

సిద్దవటం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి భాకరాపేట గ్రామంలో ఫారెస్ట్ తనిఖీ కేంద్రాన్ని శనివారం స్క్వాడ్ డీఎఫ్‌వో టి.శేఖర్‌బాబు ఆకస్మిక తనిఖీ చేపట్టి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ ఫారెస్ట్ తనిఖీ కేంద్రంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని తనిఖీ చేపట్టాలన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచందనాన్ని కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సిద్దవటం, కడప, ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో తనిఖీలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ రేంజర్ మదన్‌మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్



స్మగ్లర్, ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ సిబ్బంది

ఓబులవారిపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాదెల అటవీ ప్రాంతంలో తమిళనాడు ప్రాంతానికి చెందిన స్మగ్లర్‌ను అరెస్టు చేసి 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వేకోడూరు ఫారెస్ట్ రేంజర్ శ్యామ్‌సుందర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం గాదెల అటవీ ప్రాంతంలో తనిఖీ చేస్తుండగా ఊరగాయకొండ పరిధిలో తమిళనాడులోని తిరువన్నామలై జిల్లాకు చెందిన ఆనందన్‌రాజ్ జయశంకర్ అనే స్మగ్లర్‌ను పట్టుకున్నామన్నారు. అలాగే ఎనిమిది దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌లు ఎంవీ రమణ, మహేష్‌కుమార్, ఫారెస్ట్ బీట్ అధికారులు జనార్దన్, వీరయ్య, నాగేశ్వరనాయక్, దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు వితరణ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

పీలేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పీలేరుకు చెందిన వ్యాపారి పామిడి మల్లికార్జున గుప్త తన షష్టి పూర్తికి కుటుంబసభ్యులు, బంధువులనే కాకుండా పీలేరు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ఆహ్వానించి వారికి దుస్తులు వితరణ చేశారు. అందజేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. పామిడి మల్లికార్జున గుప్త కేవలం వ్యాపారంలోనే కాకుండా లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య సంఘం, వాసవీ కపుల్స్ అవోపా వంటి సంఘాల్లో చురుగ్గా ఉంటూ సామాజిక సేవ చేస్తుంటారు. ఆయన శనివారం తన షష్టి పూర్తి చేసుకునే క్రమంలో కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సమాజానికి సేవలందించిన 60 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జేబు కత్తిరించి డబ్బు కొట్టేసే యత్నం



దొంగను పోలీసుకు పట్టిస్తున్న బాధితుడు

● దొంగను పట్టుకున్న బాధితుడు

మదనపల్లె అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జేబు కత్తిరించి డబ్బు కొట్టేయాలనే ప్రయత్నం విఫలమైన సంఘటన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. శనివారం ఉదయం కురబలకోట మండలం ఆర్‌సీ కురవపల్లెకు చెందిన శంకర అనే వ్యక్తి తన తల్లితో కలిసి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వచ్చి ఓపీ తీసుకున్నాడు. డాక్టర్ వద్ద చూపించుకుని మాత్రలు తీసుకునే సమయంలో రద్దీగా ఉండడంతో దొంగ జేబు కత్తిరించి అందులో ఉన్న డబ్బులు రూ.70 వేలు కొట్టేశాడు. గమనించిన బాధితుడు దొంగను పట్టుకున్నాడు. జేబు కట్ చేసినప్పుడు నోట్లు కూడా కట్ అయ్యాయి. తమ్ముడికి చెందిన డబ్బులు బ్యాంకులో చెల్లించడానికి తెచ్చానని, ఆస్పత్రిలో తల్లికి చూపించుకుని బ్యాంకుకు వెళ్లేలోపే ఇలా జరిగిందని వాపోయాడు. ఆస్పత్రి అవుట్ పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని టూటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్ర తెలిపారు.

బాధితులకు న్యాయం... నిందితులకు శిక్ష పడాలి

కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలి : అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరచి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, అలాగే సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నిందితులకు శిక్షపడేలా కృషి చేయాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పోలీసుస్టేషన్‌లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పకటిప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టుల్లో చార్జ్‌షీట్ ఫైల్ చేసిన అనంతరం కోర్టు ద్వారా సంబంధిత కేసుల్లో సీసీ నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎప్పటికప్పుడు పెండింగ్ సమన్లు జారీ అయ్యేలా, వారెంట్లు అమలు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నూతనంగా అమల్లోకి వచ్చిన బీఎస్ఎస్ఎస్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కొత్త చట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలని ఆయన ఆదేశించారు. ప్రతి కోర్టు కానిస్టేబుల్ విధిగా తన పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి కోర్టులో హాజరవుతున్న ప్రతి కేసు గురించి అవగాహన పెంచుకుని సరైన సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. కోర్టు ట్రయల్ సందర్భంలో సంబంధించి స్టేషన్ హౌస్ అధికారి కూడా సమర్థవంతంగా కేసు విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కోర్టుల మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ జి.ఆదినారాయణరెడ్డి, ఎస్‌ఐ రవికుమార్, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

మద్యం మత్తులో ఘర్షణ



ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పడేసిన మద్యం బాటిల్స్

మదనపల్లె అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రి ఆవరణలో మద్యం మత్తులో ఇరువురు అంబులెన్స్ డ్రైవర్లు ఘర్షణ పడిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. కొందరు అంబులెన్స్‌ల డ్రైవర్లు ఆస్పత్రి ఆవరణలోని తమ వాహనాల్లోనే మద్యం తాగుతున్నారు. శుక్రవారం రాత్రి కూడా ఇరువురు మద్యం తాగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో వచ్చాయి. రోజూ అంబులెన్స్ డ్రైవర్లు ఇక్కడే ఉంటూ తమ వాహనాలను ఆస్పత్రి చివరిలో ఉంచుకుని అక్కడ మద్యం తాగి ఖాళీ సీసాలను కూడా అక్కడే పడేస్తున్నారు. మద్యం ఎక్కువై ఆస్పత్రికి వస్తున్న వారిపైనో, లేక అంబులెన్స్ మరో డ్రైవర్లపైనా గొడవకు దిగుతున్నారు. మద్యం మత్తులో ఆస్పత్రికి వచ్చే రోగులకు, ప్రజలు చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిన ఆస్పత్రికి వచ్చే వారు కోరుతున్నారు.

జిల్లాలో 45 మంది వీఆర్వోల ఆకస్మిక బదిలీలు

కలికిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 45 మంది గ్రేడ్-1 వీఆర్వోలను బదిలీ చేస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం రాత్రి ఆలస్యంగా ఈ జాబితా విడుదలైంది. బదిలీల జాబితాలో ఉన్న వారిలో ఒకరు కడప జిల్లా, మరొకరు చిత్తూరు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీ కాగా 43 మందిని వివిధ మండలాల నుంచి బదిలీ చేశారు. అత్యధికంగా మదనపల్లె నుంచి 10 మందిని బదిలీ చేశారు. అదే విధంగా రాయచోటి నుంచి 9 మందికి స్థాన చలనం కలిగించారు. పుల్లంపేట నుంచి ముగ్గురు, రాజంపేట నుంచి ముగ్గురు, కురబలకోట నుంచి ముగ్గురు బదిలీ అయ్యారు. వాల్మీకిపురం, కలికిరి, పీలేరు, నిమ్మనపల్లె మండలాల నుంచి ఇద్దరేసి వంతున వీఆర్వోలు బదిలీ అయ్యారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె, చిన్నమండెం, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, గుర్రంకొండ, పీటీఎం మండలాల నుంచి ఒక్కొక్కరు వంతున బదిలీ అయ్యారు. మదనపల్లె నుంచి పలు ఆరోపణల కారణంగా భారీగా వీఆర్వోలకు స్థాన చలనం కలిగించి వివిధ మండలాల నుంచి ఏరికోరి కొంతమందిని అక్కడికి బదిలీ చేసినట్లు సమాచారం. బదిలీ జాబితాలో ఉన్న వారందరినీ ఆయా తహసీల్దార్లు వెంటనే రిలీవ్ చేయాలని, అదేవిధంగా బదిలీ అయిన వారు తక్షణం చార్జి అప్పగించి కొత్త స్థానాల్లో చేరిపోవాలని ఆదేశించారు. సోమవారంలోగా మరో 50 మంది వరకు గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేయనున్నట్లు సమాచారం.

నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశాలు

సుండుపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె పంచాయతీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రిలో శనివారం వచ్చిన కథనానికి జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ స్పందించారు. నిధుల దుర్వినియోగంపై క్షుణ్ణంగా విచారణ నిర్వహించాలని రాజంపేట డీఎల్పీవో మస్తాన్‌వలిని విచారణ అధికారిగా నియమించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి సమాచారంతో నివేదికను అందించేలా ఆదేశించామన్నారు. ఏడు రోజుల్లో విచారణ చేసి పైఅధికారులకు నివేదికను అందజేస్తానని రాజంపేట డీఎల్పీవో మస్తాన్‌వలి తెలిపారు.

ఇంటర్ విద్యలో నూతన సంస్కరణలు

● ఇంటర్ విద్య జిల్లా అధికారి రవి

రాయచోటిటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యలో నూతనంగా తీసుకొచ్చిన సంస్కరణలపై అధ్యాపకులకు అవగాహన అవసరమని ఇంటర్ విద్య జిల్లా అధికారి ఎస్.రవి తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఇంటర్ విద్య జిల్లా కార్యాలయంలో యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఈ విద్యా సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన సంస్కరణలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిలబస్ మార్పు, సబ్జెక్టు కలయిక (కాంబినేషన్) ప్రశ్నపత్రంలో మార్పుల గురించి వివరించారు. ఇంటర్ చదివే విద్యార్థులు ప్రధానంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు తీసుకుంటారన్నారు. ఈ గ్రూప్ సబ్జెక్టులతో పాటు పార్ట్-1గా ఇంగ్లీషు, పార్ట్-2లో ద్వితీయ భాషగా తెలుగు, సంస్కృతం, ఉర్దూ, అరబిక్, తమిళ, కన్నడ, ఒరియా, పర్షియన్, ఫ్రెంచ్ గానీ, ప్రధాన సబ్జెక్టులైన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, సివిక్స్ గానీ, మైనర్ సబ్జెక్టులైన జియోగ్రఫీ, లాజిక్, పబ్లిక్, అడ్మినిస్ట్రేషన్, మోడర్న్ లాంగ్వేజ్ ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూల్లో ఏదైనా ఒక సబ్జెక్టులను ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు.

ఎంపీసీ విద్యార్థులు అడిషినల్‌గా (6వ సబ్జెక్టుగా) ఆప్షనల్ సబ్జెక్టు బయాలజీ, బైపీసీ విద్యార్థులు అడిషనల్‌గా (6వ సబ్జెక్టుగా) అప్షనల్ సబ్జెక్టు మ్యాథ్స్ ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఈ అడిషనల్ సబ్జెక్టును విద్యార్థులు సొంతంగా చదువుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మ్యాథ్స్-ఏ, మ్యాథ్స్-బీ సబ్జెక్టులను విలీనం చేసి మ్యాథ్స్ సబ్జెక్టుగా, బాటనీ, బయాలజీ సబ్జెక్టులను విలీనం చేసి బయాలజీ సబ్జెక్టుగా ఈ ఏడాది మొదటి సంవత్సరం విద్యార్థులకు అమలు చేస్తారన్నారు. ద్వితీయ సంవత్సరంలో గ్రూప్‌లో కానీ, సబ్జెక్టుల విలీనం కానీ, ప్రశ్నపత్రంలో మార్పులు కానీ చోటు చేసుకోలేదన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలోనూ మార్పులు ఉంటాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఏమైనా అనుమానాలుంటే నివృత్తి చేసుకోవటానికి సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.



ప్రిన్సిపాళ్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో రవి

ప్రాజెక్టులున్నా.. నీరు సున్నా...

● సమస్యల వలయంలో రైల్వేకోడూరు
● జిల్లా కేంద్రానికి ఒక్క బస్సూ లేదు...
● మంత్రి గారూ... మీరైనా పట్టించుకోండి...

రైల్వేకోడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఆదివారం నియోజకవర్గంలో పర్యటించనున్న సందర్భంగా నియోజకవర్గంలో ప్రాజెక్టులతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో వాగేటికోన, గొట్టిమానుకోన, చాకిరేవుకోన తదితర మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులున్నాయి. ఈ ప్రాజెక్టులకు ప్రతి ఏటా పనులు జరుగుతున్నా రైతుల పొలాలకు నీరందించిన పాపాన పోలేదు. ఈ ప్రాజెక్టులు కాంట్రాక్టర్లకు కల్పతరువులుగా మారుతున్నాయి. ఓబులవారిపల్లె మండలంలోని గాదెల సమీపంలో బండిరేవులకోన ఉంది. 30 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టును పట్టించుకున్న పాపానపోలేదు. చాలాసార్లు గత ఎమ్మెల్యేలు పరిశీలించినా ప్రయోజనం కనిపించలేదు.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో కాంట్రాక్టర్లకు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కాసులు కురిపిస్తున్నాయి. రైల్వేకోడూరు నియోజకవర్గానికి మరో కోనసీమగా పేరు ఉంది. ఇక్కడ మామిడి, బొప్పాయి, అరటి తదితర పంటలను రైతులు పండిస్తున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇక్కడి రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచి నాణ్యమైన పంటలను పండిస్తున్నా గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. అనంతరాజుపేట వద్ద అప్పా జ్యూస్ పరిశ్రమ ఉంది. ఇది మూతపడి 25 ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు పునఃప్రారంభానికి పాలకులు ప్రయత్నాలు చేయలేదు. రైల్వేకోడూరులో రైతులకు శీతల గిడ్డంగులు లేని కారణంగా పంటను దాచుకుని గిట్టుబాటు ధరలు వచ్చి అమ్ముకోవడానికి వీలుగా ఉంటుందని చాలాసార్లు పాలకులకు విన్నపాలు చేసుకున్నా ఫలితం శూన్యం. రైల్వేకోడూరు నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటికి ఒక్క బస్సు కూడా లేదు. అది కూడా రాయచోటికి వెళ్లి రావాలంటే ఒక్కరోజు సమయం పూర్తిగా అయిపోతోంది. ప్రజలు అష్టకష్టాలుపడి రాయచోటికి చేరుకుంటున్నారు. కలెక్టర్, ఎస్పీ తదితర కార్యాలయాలకు వెళ్లి రావాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. రైల్వేకోడూరును బాలాజీ జిల్లాలో కలపాలని ఏళ్ల తరబడి ప్రజలు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో కూడా రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో కలపాలని నాయకులు పట్టుబట్టినా ఎవరూ పట్టించుకోలేదు. జిల్లాల పునర్విభజన కమిటీలో ఉన్న మీరైనా మా గురించి పట్టించుకోండని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

రైల్వేకోడూరు నియోజకవర్గ కేంద్రంలో గుంజనేరు, ముష్టేరు, గుండాలేరు తదితర నదులు ఉన్నాయి. వీటికి రక్షణ గోడలు లేక వ్యవసాయ భూములు కోతకు గురి కావడమే కాకుండా నదీపరివాహక ప్రాంతాల్లో నివాసాలు ఉన్నా ప్రజల ఇళ్లు భారీ వర్షాల కారణంగా కొట్టుకునిపోతున్నాయి. నాలుగు లేన్ల దారి పనులు మొదలు కాలేదు. దీంతో భారీ వాహనాలు మొత్తం రైల్వేకోడూరు మీదుగా వెళుతున్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. ప్రతి ఏటా ఏనుగులు పంట పొలాలపై పడి నాశనం చేస్తున్నాయి. దీని పరిష్కారం చేయాలని ప్రభుత్వాలకు చాలా ఏళ్లుగా విన్నపాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. శనివారం ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేటకు తొలిఅడుగు కార్యక్రమానికి హాజరవుతున్న నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నియోజకవర్గ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



వాగేటికోన మైనర్ ప్రాజెక్టు కట్టాల్సిన ప్రాంతం



మూతపడిన అప్పా జ్యూస్ ఫ్యాక్టరీ

కండిషన్ లేని బస్సులు..
ప్రయాణికుల పాట్లు

మూడేళ్లుగా ఎంఎఫ్ సీటు ఖాళీ.. ● షెడ్యూలు ప్రకారం బస్సులు నడవడం కూడా అనుమానమే..

"సురక్షిత ప్రయాణం ఆర్టీసీ లక్ష్యం.." "ఆర్టీసీ బస్సులో ప్రయాణించండి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోండి" అన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నినాదాలు కడప ఆర్టీసీ డిపో పరిధిలో అపహాస్యంగా మారుతున్నాయి. ఈ డిపో నుంచి బయలుదేరిన బస్సు గమ్యస్థానానికి సక్రమంగా చేరుతుందా.. ఒకవేళ చేరినా తిరిగి డిపోకు వస్తుందా అన్న విషయంపై డిపో సిబ్బందే సంశయం వ్యక్తం చేస్తుండడంతో ప్రయాణికులు అవాక్కవుతున్నారు. కండిషన్ లేకపోవడం కారణంగా షెడ్యూలు ప్రకారం బస్సులు నడవకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులకు ఆదాయంపై ఉన్న శ్రద్ధ వాహనాల నిర్వహణపై కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.



బస్సుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



కడప ఆర్టీసీ బస్టాండు ముఖద్వారం

కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్టీసీకి చెందిన బస్సులు 86, 48 అద్దె బస్సులు వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. కడప-బెంగుళూరు సర్వీసుల కారణంగా ఈ డిపోకు అత్యధికంగా ఆదాయం చేకూరుతోంది. ఇతర రూట్ల సంగతి పక్కన పెడితే, గణనీయంగా ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఈ మార్గంలో నడిచే బస్సుల కండిషన్‌లో లోపం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత డిపో యాజమాన్యంపై ఉంది. అయితే, సంబంధిత అధికారులుగానీ, సిబ్బంది గానీ బస్సుల కండిషన్‌పై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొరాయిస్తున్న బస్సులు

పక్షం రోజుల క్రితం కడప డిపో నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బెంగుళూరుకు వెళ్లాల్సిన అమరావతి బస్సు సరైన కండిషన్‌లో లేని కారణంగా సాయంత్రం 6 గంటలకు బయలుదేరింది. దీంతో ఆ బస్సుకు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు గగ్గోలు పెట్టినట్లు సమాచారం. అంతలా బస్సుల కండిషన్ అధ్వాన స్థితికి చేరిందనే విమర్శలున్నాయి.

ఖాళీగా మెకానికల్ ఫోర్‌మన్ పోస్టు

కడప ఆర్టీసీ గ్యారేజీలో 76 మంది రెగ్యులర్ ఉద్యోగులుండగా, మరో 20 మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ఐటీఐ చేసిన వారే ఎక్కువగా ఉన్నారు వారంతా షిఫ్ట్‌ల ప్రకారం క్లీనింగ్, వాషింగ్, తదితర పనులు చేస్తుంటారు. అయితే, వారికి బస్సుల కండిషన్‌పై అంతగా అవగాహన ఉండదని అంటున్నారు. ఆ అంశంలై పూర్తి అవగాహన కలిగి ఉండే మెకానికల్ ఫోర్‌మన్ పోస్టు మూడేళ్లుగా ఖాళీగా ఉండడంతో, ఆ బాధ్యతలను అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ (ఏ.ఎం.ఎఫ్) నిర్వహిస్తున్నాడు. ఆయన నిరంతరం చిర్రుబుర్రు లాడడమే పనిగా పెట్టుకున్నారు తప్ప బస్సుల కండి షన్‌పై దృష్టి సారించడం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. దీంతో కడప డిపో నుంచి ప్రయాణికులతో వెళ్లిన బస్సు తిరిగి డిపోకు చేరే వరకూ గ్యారంటీ లేదని గ్యారేజీ సిబ్బందిలో కూడా అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. దీనికి తోడు కడప డిపోలో కాలం చెల్లిన బస్సులే ఎక్కువగా ఉన్నాయనే గుసగుసలున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

కడప డిపోలో మెకానికల్ ఫోర్‌మన్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం. బస్సుల కండిషన్‌ను పరిశీలించి, ప్రయాణి కులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం..

- గోపాల్ రెడ్డి, ఆర్ఎం, కడప రీజియన్

హెలిప్యాడ్ ఏర్పాటు పనుల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి

జమ్మలమడుగు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రాక సందర్భంగా జమ్మలమడుగు మండలంలోని అంబవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను శనివారం ప్రొద్దుటూరు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమణారెడ్డి, జమ్మలమడుగు ఏడీఈ రాజగోపాల్, ఇతర అధికారులు పరిశీలించారు. జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు టిడ్కో గృహాల వెనుక భాగాన హెలిప్యాడ్ కోసం స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదురుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టు 1న ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించే స్థలాలను ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, సర్వేయర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందిస్తున్న గంజికుంట కుటుంబ సభ్యులు

చక్రాయపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్న దాన పథకానికి రూ.1,01,116 విరాళాన్ని అందించారు. శ్రావణ మాసం తొలి శనివారం పురస్కరించుకొని ప్రొద్దుటూరుకు చెందిన గంజికుట రాజమోహన్ జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని వరలక్ష్మి, మనుమడు ఉదయ్ కిర ణ్, మనుమరాలు లక్ష్మీప్రియ అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు ఈ విరాళాన్ని అందించారు.

టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు లోమడ సుబ్బలక్షుమ్మ మృతి



చెన్నూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడప జిల్లా తెలుగుదేశంపార్టీ విశేష సేవలందించిన రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు లోమడ సుబ్బ లక్షుమ్మ(75) శనివారం మృతి చెందారు. చెన్నూరు మండలం శివాలపల్లెకు చెందిన లోమడ సుబ్బారెడ్డితో ఆమెకు వివాహం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ఉపాధ్యక్షురాలిగా ఆరేళ్ల పని చేశారు. 1995-97లో స్త్రీ శిశు సంక్షేమశాఖ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, ఆందోళనల్లో పాల్గొన్నారు. జిల్లాలో మహిళా సమస్యలపై ఎన్నోమార్లు పోరాటాలు చేశారు. గతంలో సుబ్బలక్షుమ్మ చేసిన కృషిని అభినందించేందుకు ప్రస్తుత సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆమె ఇంటికి కూడా వచ్చారు. కాగా, ఈమె భర్త లోమడ సుబ్బారెడ్డి రెండు నెలల క్రితం మృతి చెందగా, శనివారం ఆమె మృతి చెందడంతో టీడీపీ నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చెన్నూరు పెన్నానదీ తీరంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

29న ఈశ్వరీదేవి జయంత్యుత్సవాలు

బ్రహ్మంగారిమఠం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఈశ్వరీ దేవి అమ్మవారి 322వ జయంతి సంద ర్భంగా జూలై 29న ఈశ్వరీదేవి మఠం ప్రాంగణం లో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి శ్రీవీరశివకుమార స్వామి తెలిపారు. శనివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ అష్టోత్తర శత సామూహిక కలశోత్సవంలో పాల్గొనదలచిన భక్తు లు రూ.516లు సమర్పించి పేర్లను నమోదు చే యించుకున్న వారికి గోత్రనామాలతో అర్చన, కలశ పూజ చేసి, వస్త్రం, కొబ్బరికాయ, కలశాన్ని ఇస్తామన్నారు.

బైక్ ఢీకొని ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న జయరాం

కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిల బైక్ వీలింగ్ కారణంగా ఆర్టీసీ డ్రైవర్ గాయపడ్డాడు. కడప నగరంలోని 49వ డివిజన్ ఆలంఖాన్ పల్లెకు చెందిన జయరాం ఆర్టీసీ డ్రైవర్. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా ఆలంఖాన్‌పల్లె- దండు (కమలా నగర్) మధ్యలో కొందరు రెండు ద్విచక్ర వాహనాలతో వీలింగ్ చేస్తూ జయరాం నడుపుతున్న వాహనాన్ని ఢీకొన్నారు. దీంతో జయరాం కిందపడిపోయి గాయాలపాలయ్యాడు. స్థానికంగా ప్రథమ చికిత్స చేయించుకుని శనివారం ఉదయం కడప ఆర్ఎం కార్యాలయం సమీ పంలోని ఆర్టీసీ ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు పొందారు. కొన్ని నెలలుగా ఆకతాయిలు ఇష్టానుసారంగా ద్విచక్రవాహనాలను డ్రైవింగ్ చేస్తూ రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బైక్ ముందు చక్రాన్ని పైకెత్తి వెనుక చక్రం మీద వెళుతూ ఈలలు.. కేకలు వేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రహదారులపై ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

ముద్దనూరు జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చెన్నారెడ్డిపల్లె సమీపంలోని రైలు పట్టాలపై శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మృతదేహంపై తెలుపు రంగు ప్యాంటు, తెలుపు రంగు కట్ బనియన్ ఉందని, వయసు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందన్నారు. ఇతను ప్రమాదవశాత్తూ మృతి చెందాడా, ఆత్మహత్య చేసుకున్నాడా అన్న విషయం విచారణలో తేలాల్సి ఉందన్నారు. ఇతర వివరాల కోసం 9440627658 సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో భరత్‌యాదవ్ అరెస్టు

పులివెందుల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం చేసిన కేసులో భరత్‌యాదవ్‌ను శనివారం అరెస్టు చేసినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. దిలీప్‌కుమార్ హత్యకేసులో రాజీ కావాలంటూ శుక్రవారం ఆయన తల్లి మస్తానమ్మను భరత్‌యాదవ్ బెదిరించడంతోపాటు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, శనివారం నిందితుడిని అరెస్టు చేసి పులివెందుల సివిల్ కోర్టు జడ్జి ముందు హాజరుపరచగా, జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ వివరించారు

గంజాయి విక్రేతల అరెస్టు

● నాలుగు కేజీల గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కడప ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్

కడప క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్నట్లు సమా చారం అందడంతో కడప నగరంలోని పుట్లంపల్లె చెరువు వద్ద దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు కడప ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. కడప ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో శనివారం విలేక రులకు వివరాలు వెల్లడించారు. సీకేదిన్నె మండలం మామిళ్లపల్లెకు చెందిన రావులకొల్లు అజయ్ బద్వేలు టౌన్ రిక్షా కాలనీకి చెందిన కావడి శ్రీను, కడప ఇందిరానగర్‌కు చెందిన గంప మహేశ్, శివానందపురానికి చెందిన షేక్‌హుసేన్‌వలి, ప్రకాశ్‌నగర్‌కు చెందిన మల్లి, ఖాదర్ మొహిద్దీన్‌లు ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి, వాటిని ప్యాకెట్ల రూపంలోకి మార్చి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఆ మేరకు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల దాడుల సందర్భంగా పరారైన వారిని కూడా అరెస్టు చేసినట్లు వివరించారు.

భార్య చంపుతానని బెదిరించిందని భర్త ఫిర్యాదు

చెన్నూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తన భార్యే తనను చంపుతానని బెదిరించిందంటూ శివాలపల్లెకు చెందిన సుబ్బరాయుడు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. శివాలపల్లెకు చెందిన బత్తల సుబ్బరాయుడుకు భార్య శ్రీలతతోపాటు కుమారుడు ఉన్నారు. మూడు నెలల క్రితం ఇంట్లో 14 తులాల బంగారంతో తన స్వగ్రామమైన నంద్యాలకు వెళ్లి ఆమె తిరిగి రాకపోవడంతో, భర్త ఫోన్ చేసి ఆరా తీశాడు. ఇంటికి రావాలని కోరాడు. దాంతో ఆమె తాను సాయిగణేశ్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకున్నానని, తాను తీసుకు వచ్చిన బంగారం అతనికి కట్నంగా ఇచ్చానని, ఇక నీ దగ్గరకు రానని, అక్కడే ఉంటానని, కొడుకును బాగా చూసుకుంటానని చెప్పింది. గట్టిగా మాట్లాడితే చంపుతానని బెదిరించిందని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

● డీఆర్వో విశ్వేశ్వరనాయుడు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

చెన్నూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు పిలుపునిచ్చారు. చెన్నూరులో శనివారం చెన్నూరు యువత ఆధ్వర్యంలో స్థానిక చౌడేశ్వరి ఆలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగ విచ్చేసిన డీఆర్వో మాట్లాడుతూ రక్తదానం అనేది పుణ్యకార్యంగా భావించాలన్నారు., చెన్నూరు యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. రక్తదానంపై పలురకాల అపోహలు ఉంటాయని, వాటిని వదులుకుని సమాజ సేవలో భాగంగా ఆరోగ్యవంతమైన యువత ఏడాదిలో మూడు మార్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్తదానం చేయవచ్చన్నారు. దీంతో శరీరంలో మరింత చురుకుదనం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు రక్తదానం చేసిన యువతను అభినందించారు. అలాగే యువకులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇద్దరు మహిళలతో సహా 74 మంది రక్తదానం చేయగా, వారందరికీ ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, కోఆర్డినేటర్లు ఉట్టి శ్రీకాంత్, సునీల్, డీపీఎం భాస్కర్, మెడికల్ ఆఫీసరు వినయ్‌కుమార్‌రెడ్డి, చౌడేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు సుధామూర్తి, జేబీవీఎస్ అధ్యక్షుడు అశోక్, గుగ్గిళ్ల చాణక్య, పెడబల్లె శ్రీకాంత్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఓట్లు మావే.. సీట్లూ మావే !

● ఆత్మీయ సమావేశంలో బీసీ నాయకులు



మాట్లాడుతున్న హనుమంతరావు

కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఓట్లు మావే.. సీట్లు కూడా మావే అనే నినాదంతో బీసీ వర్గాలను జాగృతం చేసి, రానున్న ఎన్నికల నాటికి శాసించే శక్తిగా మారుస్తామని బీసీ కులాల వేదిక నాయకులు ప్రకటించారు. స్థానిక పాతరిమ్స్‌లోని బీ.సీ.భవన్‌లో శనివారం రాయలసీమ జిల్లాల్లోని బీసీ కులాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ బ్రాహ్మ ణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పార్టీ ఎన్నికల ముందు బీసీల సంక్షేమానికి కృషి చేస్తామని గొప్పలు చెప్పడం.. గద్దెనెక్కగానే గాలికొదిలేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటివరకూ స్థానికంగా అధిక జనాభా గల కులాలకు మాత్రమే అన్ని పార్టీలు అవకాశం కల్పించాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అధిక జనాభా ఉన్న కులాలకు ప్రాధాన్యం లభించలేదన్నారు. ఇప్పటివరకూ రాజ్యాధికారంలో భాగ స్వామ్యం లేని బీసీ కులాలను అసెంబ్లీ, పార్లమెంట్‌లోకి తీసుకుని పోయేలా బీసీల్లో చైతన్యం తెస్తామన్నారు. దాదాపు 150కి పైగా గల బీసీ కులాల్లో కేవలం ఐదారు కులాలకే పార్టీలన్నీ ప్రాధాన్యం కల్పిస్తున్నాయని, మిగిలిన కులాలను డబ్బులు లేవనో, జనాభా లేదనో చట్టసభలలో అవకాశం కల్పించడం లేదన్నారు. ఇక నుంచి అన్ని కులాలకు రాజ్యాధికారంలో అవకాశం కల్పించడమే లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

● ఏడీఏ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

పులివెందుల రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విచక్షణా రహితంగా రసాయన ఎరువుల వినియోగంతో నిస్సారంగా మారిన నేలకు జవజీవాలందించడంతోపాటు, ఆరోగ్యకరమైన పంటలు అందించే ప్రకృతి వ్యవసాయం వైపు ఆకర్షితులయ్యేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు అంబవరం ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడులు ఎక్కువ కావడానికి విచ్చలవిడిగా రసాయన, పురుగు మందుల వాడకమే కారణ మన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంతో తక్కువ పెట్టుబడితోనే పంటలు పండించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలకు మంచి ధర కూడా దక్కుతుందన్న విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పైరును ఈ- క్రాప్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి రైతుతో ప్రధాన మంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లించేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. చీడపీడలను గుర్తించి సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నత్రజని ఎరువులు అనవసరంగా వాడితే చీడపీడల ఉధృతి పెరిగి పంట దెబ్బ తినే అవకాశం ఉందన్నారు. అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ, అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు చెన్నారెడ్డి, శివశంకర్ రెడ్డి, ఓబులేసు, చంద్రశేఖర్‌రెడ్డి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో అనంతపురం, చిత్తూరు జట్లు

● హోరాహోరీగా ఏసీఏ అండర్-16 మెన్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-కర్నూలు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొ దటి ఇన్నింగ్స్‌లో 210 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. ప్రతిగా బ్యాటిం గ్‌కు దిగిన కర్నూలు జట్టు 51.3 ఓవర్లలో కేవలం 125 పరుగులకే కుప్పకూలిం ది. దీంతో రెండవ రోజున బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. సాత్విక్ 131 పరుగు లు చేయడంతో అనంతపురం జట్టు 342 పరుగుల ఆధిక్యత సాధించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో..

నగర రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు- నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌లో చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 76.3 ఓవర్లలో 270 పరుగు లకు ఆలౌటైన సంగతి తెలిసిందే. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 21 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 70 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 70 పరుగులతో రెండవ రోజున బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 103.5 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సుశాంత్ 60 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉండగా మరో బ్యాటర్ చైతన్య 52 పరుగులు చేశారు. రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 40 పరుగులు చేసింది. ఇందులో హర్ష 21 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో చిత్తూరు జట్టు 22 పరుగుల స్వల్ప స్కోర్ ఆధిక్యంలో నిలిచింది.

ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం

ప్రజల ఆదరణ మరువను ● అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా ● గుర్రంకొండను అభివృద్ధి పథంలో నడిపిస్తా

కేవీపల్లె, వాల్మీకిపురం, గుర్రంకొండ సింగిల్ విండో చైర్మన్ల ప్రమాణోత్సవ సభలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి





ప్రమాణం చేస్తున్న కేవీపల్లె సింగిల్ విండో సభ్యులు - వాల్మీకిపురం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి - బాధ్యతలు చేడుతున్న గుర్రంకొండ చైర్మన్ మూర్తిరావు

పీలేరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): కష్టపడే ప్రతి కార్యకర్త, నాయకుడికీ పార్టీ ప్రత్యేక గుర్తింపు ఇస్తుందని, సముచిత స్థానం కల్పిస్తుందని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి అన్నారు. కేవీపల్లె, వాల్మీకిపురం, గుర్రంకొండ సింగిల్‌విండో చైర్మన్ల ప్రమాణం శనివారం వేడుకగా నిర్వహించారు. స్వీకారోత్సవ సభకు విశేష అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ తండ్రి నల్లారి అమర్‌నాథ్ రెడ్డి, అన్న మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి హయాం నుంచి కేవీ పల్లె తమను ఆదరించిందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే మారుమూల మండలమైన కేవీపల్లెను తమ కుటుంబం అన్ని విధాలా అభివృద్ధి చేసిందన్నారు. మండల ప్రజల తాగునీటి కోసం ఝరికోన ప్రాజెక్టు నిర్మించి ప్రజలకు సురక్షిత తాగునీరు అందిస్తున్నామన్నారు. వ్యవసాయ ఆధారిత మండలమైన కేవీపల్లెకు జిల్లా సహకార బ్యాంకు పాలకవర్గంతో చర్చించి కేవీపల్లె సింగిల్ విండో ద్వారా రైతులకు సబ్సిడీ రుణాలు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగినా ప్రస్తుత పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలను వదులుకునేది లేదని, ఈ మండలాలు ఏ నియోజకవర్గంలో కలిసినా తమ కుటుంబం అక్కడి నుంచే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం సింగిల్ విండో అధ్యక్షుడిగా ఎన్నికైన నల్లపురెడ్డి సురేశ్ రెడ్డి, సభ్యులు వెంకటరమణ, నారాయణ రెడ్డిని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తిమ్మాపురం రఘన్న, గీతాంజలి, కండక్టర్ రమణ, సుధాకర్ నాయుడు, వగళ్ల చిన్నా, కుప్పం రవిచంద్రారెడ్డి, వెంకటరత్నం, వెంకటరమణారెడ్డి, సంఘం శివారెడ్డి, ఎంజీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం

వాల్మీకిపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సింగిల్‌విండో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి దివంగత నల్లారి అమరనాథరెడ్డి కాలం నుంచీ వాల్మీకిపురంపై ప్రత్యేక ప్రేమాభిమానాలు ఉన్నాయని, గడిచిన ఎన్నికల్లో తనపై పట్టణం, మండల ప్రజలు చూపిన ఆదరాభిమానాలు ఎన్నటికీ మరువలేనన్నారు. నూతన కార్యవర్గాన్ని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని గజమాలతో సత్కరించి సాదర స్వాగతం పలికారు. అనంతరం సింగిల్‌విండో చైర్మన్‌గా ఆర్.కృష్ణారెడ్డి, డైరెక్టర్లు లంకిపల్లె మధు (చింతపర్తి), మొహిద్దీన్‌అలీఖాన్ (చాను) (వాల్మీకిపురం) ప్రమాణం చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్, టీడీపీ నియోజకవర్గ నేతలు పీవీ నారాయణ, శేషాద్రిరెడ్డి, రాజేంద్రాచారి, కోసూరి రమేష్, మురళి, డిష్ బ్రదర్స్, పీలేరు టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, కువైట్ సయ్యద్‌బాషా, బొక్కసం బ్రదర్స్, కూటమి నేతలు, అధికారులు, నల్లారి కుటుంబ అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

గుర్రంకొండను అభివృద్ధి పథంలో నడిపిస్తా

గుర్రంకొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు చేయించి గుర్రంకొండ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సింగిల్ విండో చైర్మన్ ప్రమాణోత్సవంలో సింగిల్ విండో చైర్మన్‌గా ఎం.ఎల్.ఎన్.మూర్తిరావు, సభ్యులుగా సాలార్‌సాబ్, సత్యనారాయణరెడ్డి చేత ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన తాగు, సాగు నీటి సమస్యలపై ప్రత్యేక చొరవచూపి పరిష్కరిస్తామన్నారు. గండికోట జలాలు తీసుకొచ్చి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. హంద్రీ-నీవా జలాలను జిల్లాకు తీసుకొచ్చి వ్యవసాయ పొలాలను సస్యశ్యామలం చేసి రైతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో నేతలు జగదీష్ కుమార్, ఇంతియాజ్ అహ్మద్, నౌషాద్ అలీ, మహాత్మారెడ్డి, ఎల్లుట్ల మురళి, నౌషాద్ అహ్మద్, జయసూరి, నాగేంద్ర, చలమారెడ్డి, సుదర్శన్, ఆనంద్, సుంకర శేఖర్, నక్కా సతీస్, ఇక్బాల్ ఖాసీం, బాబాజాన్, చంద్రబాబు, బయ్యారెడ్డి, మేకల చలపతి, ఎం.డీ.జమీర్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మూర్తిరావు

ప్రమాణస్వీకారం అనంతరం గుర్రంకొండ సింగిల్ విండో చైర్మన్‌గా మూర్తిరావు బాధ్యతలను చేపట్టారు. సభ్యులుగా సాలార్‌సాబ్, సత్యనారాయణరెడ్డి కూడా బాధ్యతలను చేపట్టారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనపల్లెలో కార్గిల్ విజయ్‌దివస్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీసైనికులు

మదనపల్లె/ మదనపల్లె అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): దాయాది దేశం పాకిస్తాన్‌తో భారత్ కార్గిల్ యుద్ధంలో సాధించిన విజయానికి చిహ్నంగా శనివారం కార్గిల్ విజయ్ దివస్ చేపట్టారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో స్థానిక చిత్తూరు బస్‌స్టాండు సర్కిల్ నుంచి బెంగళూరు బస్‌స్టాండు వరకూ మాజీసైనికులు ర్యాలీ నిర్వహించి భారత్ సాధించిన విజయాన్ని ప్రజలకు వివరించారు. వీర సైనికులు అమర త్యాగాలకు చిహ్నంగా.. భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

మల్లికార్జున సర్కిల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో...

నాటి ప్రధాని వాజ్‌పేయి సమర్థవంతమైన నాయకత్వంలో కార్గిల్ చొరబాటుకు ప్రయత్నించిన పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పిన సంఘటనలో ఎందరో భారత సైనికులు ప్రాణాలను అర్పించి విజయం సాధించారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్ వారి సేవలను కొనియాడారు. మల్లికార్జున సర్కిల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో కార్గిల్ అమరులకు ఘన నివాళులర్పించారు. నేడు ప్రధానిగా నరేంద్రమోదీ నాయకత్వంలో మరింత విస్తృతంగా పాకిస్తాన్ ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేసే స్థాయిలో భారతీయులు ఎదిగినందుకు గర్విస్తున్నామన్నారు. బీజేపీ నేతలు పులి నరేంద్రకుమార్‌రెడ్డి, బండి ఆనంద్, వరదారెడ్డి నారదరెడ్డి, జబ్బల శ్రీనివాసులు, వినోద్ యాదవ్, పిల్లస్వామినాయక్, కిరణ్‌కుమార్, బర్నేపల్లె రవికుమార్, నాగరాజు, పూల నాగరాజు, బాలకృష్ణ, శ్రీకాంత్, కోసూరి భవానీ పాల్గొన్నారు.

జనసేన నేత అమరనారాయణకు ఘన సన్మానం



అమర నారాయణను సన్మానిస్తున్న టీడీపీ నేత కోపూరి మల్లికార్జున నాయుడు

మదనపల్లె, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల విచారణ చేపట్టే తిరుపతి ప్రత్యేక న్యాయస్థానం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎస్‌పీపీ) అమరనారాయణను జనసేన, టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. ఆయన నివాసంలో తంబళ్లపల్లె టీడీపీ సమన్వయకర్త కోపూరి మల్లికార్జుననాయుడు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఇందులో భూమి సీడ్స్ కుమార్, భూమి సీడ్స్ రమణ, చరణ్, తదితరులు ఉన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు ఆధ్వర్యంలో సన్మానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన లీగల్ సెల్ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయనకు ప్రభుత్వం తగిన గుర్తింపు నిచ్చిందన్నారు. జనసైనికులు జగదీష్, ఆంజనేయకుమార్, లీలాకర్, బాలాజీ, శ్రీనివాసులు, ఎన్.కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, చలపతి, గురుప్రసాద్, కుమార్ పాల్గొన్నారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు అమరనారాయణను సన్మానించి, ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వై.దొరస్వామినాయుడు, బండి అమర్, వరప్రసాద్, ఉమేష్, శ్రీకాంత్, పరుపుల జయరాంయాదవ్, వెంకటరమణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలు లులు కంపెనీకి కట్టబెట్టడం తగదు

● పీలేరులో ఎర్రరిబ్బన్లు ధరించి ఎన్‌ఎంయూ నిరసన



పీలేరులో ఎర్ర రిబ్బన్లు ధరించి ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

పీలేరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ సంస్థకు చెందిన కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను 'లులు' కంపెనీకి కట్టబెట్టడం తగదని ఎన్‌ఎంయూ రీజనల్ కార్యదర్శి పీ.ఎస్. ఎం రాజు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం పీలేరు ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు ఆర్టీసీ ఆస్తులు ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టడంపై ఎర్రరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీకి వందల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని, వీటిని ఉద్యోగ సంఘాలతో సంప్రదించకుండా ఏకపక్షంగా ప్రభుత్వం 'లులు' ఇతర ప్రైవేట్ బడా కంపెనీలకు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. శనివారం తెల్లవారి జాము నుంచి ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు ఎర్రరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు సీ.వీ. రమణ, జీ. ఆదినారాయణ, రీజనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బీ.ఆర్.బీ నాయక్, కే. హరి, కే. హరినాద్, మహేశ్వర, యూనియన్ నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం



భూమి పూజ చేస్తున్న డీఎం నిర్మల, తదితరులు

పీలేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా పీలేరు ఆర్టీసీ బస్‌స్టాండులో ప్రయాణీకులను వేధిస్తున్న మరుగుదొడ్ల సమస్య త్వరలోనే తీరనుంది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్ల స్థానంలో కొత్తవాటిని నిర్మించేందుకు ఆర్టీసీ అధికారులు పచ్చజెండా ఊపారు. దీంతో శనివారం డీఎం నిర్మల వాటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. బస్‌స్టాండులో అధునాతన మరుగుదొడ్లు నిర్మించేందుకు రూ.45 లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులతో స్త్రీలకు ఆరు, పురుషులకు ఆరు మరుగుదొడ్లు, పురుషులకు మూత్ర విసర్జన శాలలు 10, ఒక స్నానపు గది నిర్మిస్తామన్నారు. మూడు నెలల్లో వాటిని పూర్తి చేసి ప్రయాణీకులకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ సిద్దనాగులు, బస్టాండు మేనేజర్ బాబు నాయక్, లక్ష్మయ్య, ఆది, తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి : డీఎస్పీ



డీఎస్పీ కార్యాలయంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని మదనపల్లె డివిజన్ పరిధి రౌడీ షీటర్లకు డీఎస్పీ మహేంద్ర కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లపై నిఘా ఉంచి ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మీరు సత్ప్రర్తనతో మెలిగినపుడు మీ కుటుంబాలకు కూడా విలువ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మదనపల్లె డివిజన్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలో పోటీతత్వం పెరగాలి

మదనపల్లె టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): డిజిటల్ యుగంలో విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని రిసోర్స్‌పర్సన్ సందీప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ విధానంతోనే ఎక్కువగా ప్రపంచం నడుస్తోందని, భవిష్యత్ తరాలకు ఇదే ముందడుగుగా నిలుస్తోందన్నారు. విద్యార్థులు ఈ దిశన ప్రయాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ పి.రాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ చలపతి

మదనపల్లె అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని చిప్పిలి సర్పంచ్ పసుపులేటి చలపతి అన్నారు. శనివారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాల్వలు, తాగునీటి సౌకర్యాలు కొరత లేకుండా చేశామన్నారు. గ్రామ సభలో రెవెన్యూ అధికారులు పాల్గొని సమస్యలుంటే ఫిర్యాదు చేయాలన్నారు. సచివాలయం ద్వారా అన్ని సమస్యలకు, ప్రజలకు చేరువలో ఉండి పరిష్కార మార్గం చూపుతున్నామన్నారు. మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు చేపట్టాలి

జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన దోమల నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన గ్యారంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా రక్త పరీక్షల సంఖ్య పెంచాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో ఉన్న మలేరియా, సీజనల్ వ్యాధులు రికార్డులను పరిశీలించారు. రోజూ సాయంకాలం ఓపీ విధిగా ఉండాలని సూచించారు. జ్వరాలు ప్రబలకుండా రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హరి, ఫార్మసిస్ట్ గంగాధర్, ల్యాబ్ ఇన్‌చార్జి అమర్, ఎచ్ఎస్ శ్యామల తదిరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో చెడే ఎక్కువ

మదనపల్లె టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులకు సోషల్ మీడియా ద్వారా మంచి కన్నా చెడు ఎక్కువ ఆకర్షిస్తోందని ఫోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో ఫోర్డు సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశమై విద్యార్థులు సాధ్యమైనంత వరకు మొబైల్‌ఫోన్లకు దూరంగా వుండాలన్నారు. వారి తల్లిదండ్రులు కూడా విద్యార్థుల మానసిక స్థితి, నడవడికను గమనిస్తూ వుండాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, హెచ్ఎం రఘు, డాక్టర్లు షాబియా షరీఫ్, రేచెన్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

కలికిరి నుంచి ఇద్దరు వీఆర్వోలు బదిలీ

కలికిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి ఇద్దరు గ్రేడ్-1 వీఆర్వోలు బదిలీ అయ్యారు. మర్రికుంటపల్లె నుంచి ఎన్.సురేష్‌కుమార్ రెడ్డిని మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లెకు, మునేళ్ళపల్లె వీఆర్వో ఎం.నరేంద్రారెడ్డిని అదే మండలంలోని కోళ్ళబైలు-2 వీఆర్వోగా బదిలీ చేశారు. ఖాళీ అయిన మర్రికుంటపల్లెకు మదనపల్లె మండలం కోళ్ళబైలు-1 వీఆర్వో జి.శివశంకర్‌ను, మునేళ్ళపల్లెకు మదనపల్లె మండలం వలసపల్లె వీఆర్వో ఎం.శ్రీనివాసులును బదిలీ చేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

గుర్రంకొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతులు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగిఉండాలని ఏఓ రత్నమ్మ అన్నారు. శనివారం గుర్రంకొండ రైతు సేవా కేంద్రంలో చట్టంపై రైతులకు అవగాహన నిర్వహించిన ఆమె మాట్లాడుతూ తమకు కావాల్సిన సమాచారాన్ని ప్రతి శాఖ నుంచి పొందవచ్చన్నారు. సమాచారాన్ని నిర్ణీత గడువులోపు ఇవ్వకుంటే అప్పీలు ద్వారా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని వినతి

పీలేరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పీలేరు - చిత్తూరు జాతీయ రహదారిపై ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్టీసీ డీఎంకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి మాధవ్ మాట్లాడుతూ పలుమార్లు బస్సులు ఆపాలని కోరినా ప్రయోజనం లేదని, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

తాగునీటి సమస్యపై తక్షణం స్పందించాలి

● మండల సమావేశంలో ఎంపీడీఓ హరినారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హరినారాయణ

ములకలచెరువు, జూలై 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే తక్షణం స్పందించాలని ఎంపీడీఓ హరినారాయణ ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ సాయిలీల అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య ఏర్పడితే తమ దృష్టికి తేవాలన్నారు. అన్ని గ్రామాల్లో తప్పనిసరిగా చెత్త సేకరణ చేపట్టాలన్నారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం వంద శాతం చెత్త సేకరణ జరగాలన్నారు. పంచాయతీల్లో గ్రీన్ అంబాసిటర్లు లేకుంటే నియమించుకోవాలన్నారు. అనంతరం మండల అధికారులు తమ శాఖ పరిధిలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ, ఎంఈఓ వెంకటరమణ, ఏఓ స్రవంతి, ఏపీఓ నారాయణస్వామి, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

తరగతుల్లో బ్యాక్ బెంచ్ విధానం వద్దు



రౌండ్ టేబుల్ విధానంలో బోధన అందిస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో బ్యాక్‌బెంచ్ విధానం బదులు రౌండ్ టేబుల్ విధానంలో విద్యార్థులు శ్రద్ధగా పాఠాలు వింటున్నారని మోడల్‌పాఠశాల హెచ్‌ఎం గుల్జార్ బేగం అన్నారు. శనివారం కొత్తిండ్లు మోడల్ పాఠశాల తరగతి గదిలో రౌండ్ టేబుల్ సమావేశంలా బెంచ్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో కూర్చున్న విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విన్నారు. ఈ విధానంతో ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుడికీ కనపడతాడని, పాఠాలను సక్రమంగా వింటున్నారా లేదా తెలుస్తుందన్నారు. కొందరు విద్యార్థులను బ్యాక్‌బెంచ్ స్టూడెంట్ అనే పదాన్ని ఇక్కడ తొలగించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విష్ణుప్రియ పాల్గొన్నారు.

మోసపూరిత ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పీలేరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు, ఆకర్షణీయమైన గిఫ్టులు, పెద్దమొత్తంలో లాటరీ గెలుచుకున్నట్లు వచ్చే ప్రకటనలు, ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని పీలేరు ఎస్ఐ లోకేశ్ విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాలపై శనివారం ఆయన పీలేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ మనిషి ఆశను పెట్టుబడిగా చేసుకుని చాలా మంది నేరగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులు చైతన్యవంతులు కావడమే కాకుండా తమ చుట్టుపక్కల వారిని కూడా అప్రమత్తం చేస్తూ అటువంటి మోసగాళ్ల బారిన పడకుండా చూడాలన్నారు. అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు స్థానిక పోలీసులకుగానీ, 1930 నెంబరకుగానీ సమాచారం అందించాలన్నారు. అనంతరం వివిధ రకాల సైబర్ నేరాలు, వాటి నుంచి తప్పించుకునే విధానాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు తీరిన మేత కరువు



కలకడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రసుత్తం అడపా దడపా కురుస్తున్న వర్షాలకు పచ్చదనం పెంపొంది మూగజీవాలకు కొంతమేర మేత కరువు తీరింది. ఎండల ప్రభావంతో ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో బీడు భూముల్లో పచ్చిక కనుమరుగై మూగజీవాలు కడుపు నింపుకోవడం కష్టతరమైంది. దీంతో పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులు వ్యయ, ప్రయాసలు పడి బయటి నుంచి ఎండు గడ్డిని కొనుగోలు చేసి కాస్తో కూస్తో ఆకలి తీరుస్తూ కాలం వెళ్లదీస్తూ వచ్చారు. ఇపుడు పుడమిపై పచ్చదనం బాగా పెంపొందడంతో రైతున్నలకు గడ్డి కొరత తీరింది. కారణంగా పొలాల్లో విచ్చుకున్న గరిక, ఆకు అలములు తింటూ పాడి ఆవులు, గొర్రెల మందలు కడుపు నింపుకోవడంతో యజమానులు సంతోషపడుతున్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి

తంబళ్లపల్లె, జూలై 26(ఆంధ్రజ్యోతి): కోసువారిపల్లె ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రమేష్, మధుసూదన్ సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలతో నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించి వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, సిబ్బంది నగేష్, టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం మండలంలో....

పెద్దమండ్యం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రావణమాసం మొదటి శనివారం వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆంజనేయస్వామి, రామాలయాలు, నరసింహస్వామి దేవాలయాల్లో పూజలు జరిగినట్లు అర్చకులు మణికంఠస్వామి తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంచముఖ హనుమన్నకు....



కలకడ జూలై 26 (ఆంధ్రజ్యోతి): పవిత్ర శ్రావణ శనివారం పురస్కరించుకుని బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారిని వివిధరకాల పుష్పాలు, తమలపాకుల హారాలతో పత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజ కార్యక్రమాలు జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తాదులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మోరుకొండలో...

రామసముద్రం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మోరుకొండలో వెలిసిన పవిత్ర పుణ్యక్షేత్రం గెవితిమ్మరాయస్వామి వారికి శ్రావణ మాసం పూజలు ప్రారంభమయ్యాయి. ఏటా స్వామివారికి శ్రావణ శనివారాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మొదటి శనివారం స్వామివారికి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కమిటీ సభ్యులు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు వైసీపీ స్టేట్ బీసీ జనరల్ సెక్రటరీ కనగాని గెవన్న అన్నదానం నిర్వహించారు.

సీపీఐ మండల కార్యదర్శిగా నరేశ్

మదనపల్లె అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): సీపీఐ నిమ్మనపల్లె మండల కమిటీ సమావేశం శనివారం మదనపల్లె పట్టణం ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి పాల్గొన్నారు. ఇందులో నిమ్మనపల్లె మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో మండల కార్యదర్శిగా నరేశ్ ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నేతలు మాధవ్, రెడ్డిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.